

మురిసిన భవిత



మెరిసిన యువత

ఈనాడు
పల్నాడు
గురువారం అక్టోబరు 24, 2024

అమరపురి.. సృజన సిరి..

ఘనంగా రెండు రోజుల డ్రోన్ సమ్మిట్

ఆశ్చర్యపరిచిన ఆధునిక, సాంకేతిక ప్రదర్శనలు

ఈనాడు, ఈనాడు డిజిటల్ – అమరావతి


మంగళగిరిలో రెండో రోజు ప్రదర్శనకు ఉంచిన ఆధునిక డ్రోన్లను చూసి విద్యార్థులు.. గొప్ప అనుభూతికి లోనయ్యారు. తమకు ఇప్పటివరకూ వీటి గురించి ఇంత అవగాహన లేదని.. తొలిసారి ఇలాంటివి చూస్తున్నామని తెలిపారు. తాము కూడా పెద్దయ్యాక డ్రోన్లను తయారుచేస్తామని విద్యార్థులు ఆనందంగా చెప్పారు. ఇవి చూసి ఎంతో స్ఫూర్తి పొందామని, భవిష్యత్తులో డ్రోన్ల విప్లవం రానుందని.. ఇవన్నీ ప్రత్యేక నిదర్శనమని ఇంజినీరింగ్ విద్యార్థులు పేర్కొన్నారు. తాము ఇప్పటికే పొలాల్లో డ్రోన్లతో పురుగు మందులను పిచికారీ చేయిస్తున్నట్లు కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, మంగళగిరి, గుంటూరు ప్రాంతాల రైతులు ఆనందంగా తెలిపారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల సాయం మరింత పెరిగితే.. రైతులకు ఎంతో ప్రయోజనకరమన్నారు.

రైతన్నకు తోడుగా.. విహార్

ఐఐటీ మద్రాసు విద్యార్థులు, అధ్యాపకుల సహాయంతో 'విహార్' పేరుతో డ్రోన్‌ను తయారు చేశారు. ఐఐటీ ప్రాంగణంలోనే స్టార్టప్ కంపెనీ పెట్టారు. ఈ డ్రోన్‌ను క్రిమిసంహారక మందులు, విత్తనాలు చల్లడానికి వాడవచ్చు. డ్రోన్ కింద అమర్చిన డబ్బాలో మందులను ఉంచి.. పిచికారీ చేయొచ్చు. రైతులు సులభంగా విత్తనాలను కూడా పొలాల్లో చల్లుకోవచ్చు. 30 కిలోల బరువు ఉండే ఈ డ్రోన్‌కు.. 10 లీటర్ల ద్రావణం ఒకేసారి పైకి తీసుకెళ్లి పిచికారీ చేసే సత్తా ఉంది. రెండు గంటల్లో 30 ఎకరాలకు పురుగుమందు పిచికారీ చేయగలదు. 100 అడుగుల ఎత్తు ఎగురుతుంది. తమ డ్రోన్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) నుంచి టైప్ సర్టిఫికేషన్ ఉందని సంస్థకు చెందిన విఘ్నేశ్ వెల్లడించారు.



విహార్ డ్రోన్



ఈ డ్రోన్లు చూస్తే ఆశ్చర్యం వేస్తోంది..

నేను 12 ఎకరాల్లో వరి, మినుము పండిస్తున్నా. ఇటీవల డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేయించా. పంపు సెట్లతో కొడితే.. రోజులు పడుతుంది. పనివారూ దొరకడం లేదు. సొంతంగా డ్రోన్ కొంటే.. నాతోపాటు మా ఊరి రైతులకూ ఉపకరిస్తుందనే ఉద్దేశంతో చూసేందుకు ఇక్కడికి వచ్చా. పెట్రోలు, బ్యాటరీతో ఎక్కువ సమయం ఎగిరే డ్రోన్‌ను కొంటా. ఈ డ్రోన్లను చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంది.

– వి.నర్సింగరావు, రైతు, గుడివాడ



అమరావతి డ్రోన్ సమ్మిట్ చూసేందుకు విజయవాడ, గుంటూరు సహా చుట్టుపక్కల ప్రాంతాల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ ప్రాంతాల రైతులు, ప్రజలు భారీగా విచ్చేసి డ్రోన్ల ప్రదర్శనను తిలకించారు. విజయవాడ కృష్ణా తీరంలో తొలి రోజు నిర్వహించిన.. 5,500 డ్రోన్ల ప్రదర్శన చూపరులను కట్టిపడేసింది. రెండో రోజు డ్రోన్ల సాంకేతికత, సమాజ అవసరాలకు ఎలా వినియోగించాలనే అంశాలపై.. మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్‌లో నిర్వహించిన.. సమావేశాల్లో నిపుణులు పాల్గొని.. అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన.. సమ్మిట్‌లో దేశవ్యాప్త సాంకేతిక నిపుణులు వచ్చి తాము రూపొందించిన ఆధునిక డ్రోన్లను ప్రదర్శించి.. ఔరా అనిపించారు.

సర్వైలెన్స్, మ్యాపింగ్‌కు.. సిగ్మా25



'సిగ్మా-25' డ్రోన్ అందరినీ ఆకర్షిస్తోంది. సర్వైలెన్స్, మ్యాపింగ్ సహా పలు అవసరాలకు దీనిని వాడొచ్చు. ఇన్‌డ్రోన్స్ సంస్థ రూపొందించిన ఈ డ్రోన్ అత్యంత తేలికైంది. కేవలం 3.5 కిలోల కంటే తక్కువ బరువు ఉంటుంది. 50 నిమిషాల్లో నాలుగు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని పక్కాగా సర్వే చేస్తుంది. రైల్వే ట్రాక్, రహదారులు, వంతెనలు, ఆయిల్, గ్యాస్ రిఫైనరీలు, వ్యవసాయం, గనులు, విపత్తులు, టెలీకమ్యూనికేషన్, నిర్మాణం, స్మార్ట్ సిటీల నిర్వహణ వంటి అన్ని అవసరాలకూ వాడవచ్చు. ఈ డ్రోన్‌లో పగలు, రాత్రీ అత్యంత నాణ్యమైన వీడియోలను రికార్డుచేసే అత్యాధునిక కెమెరా అమర్చారు. బహిరంగ సభలు, ఉత్సవాల నిర్వహణకూ వాడవచ్చు.


రైతులకు, గిరిజనులకు భరోసా...





పెనమలూరు కుర్రాడు శామ్యూల్ ప్రభుత్వ యంత్రాంగానికి ఉపకరించే డ్రోన్ రూపొందించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చదివి స్వీడన్‌లో కంట్రోల్ సిస్టమ్స్ ఇంజినీర్‌గా పనిచేశారు. ప్రస్తుతం స్వదేశానికి వచ్చేసి.. విజయవాడ శివార్లలో డ్రోన్‌హబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను నెలకొల్పారు. రెండు రకాల డ్రోన్లను రూపొందించారు. ఒకటి అడవులు, కొండగుట్టల్లో ఉండే తండాల్లోని వారికి అత్యంత తేలికగా సరకులు, మందులు సహా ఏ అవసరం ఉన్నా తీసుకెళ్లి ఇచ్చే డ్రోన్. మరొకటి... ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ఆటోమేటిక్ డ్రోన్. సాధారణంగా పొలానికి పురుగు పడితే.. మొత్తం పంటకు పిచికారీ చేస్తారు. కానీ.. ఎక్కడ పురుగు పట్టిందో ఆ ప్రదేశాన్నే పక్కాగా ఆధునిక కెమెరా, ఏఐ ద్వారా గుర్తించి.. మందును సరిగ్గా అక్కడే ఈ డ్రోన్ పిచికారీ చేస్తుంది. తద్వారా పురుగు మందు వినియోగం సగానికి తగ్గించొచ్చు. ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ల సహకారంతో దీనిని రూపొందించారు.

సాగులో సగం ఖర్చు తగ్గుతోంది..



20 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. నాలుగేళ్లుగా పురుగు మందులు పిచికారీ చేయిస్తున్నా. సాధారణంగా ఇద్దరు మనుషులు రెండు రోజుల్లో 20 ఎకరాలకు మందులు జల్లుతున్నారు. ఒకరికి రోజుకు రూ.500 చొప్పున రూ.2 వేలు ఖర్చు. అదే డ్రోన్‌తో 5 గంటల్లో పని పూర్తయి.. రూ.వెయ్యి వెచ్చిస్తే చాలు. పైగా డ్రోన్‌తో మందుల పిచికారీ చేస్తే వృథా తగ్గుతోంది.

– ఎన్. వెంకటేశ్వరరావు, రైతు, తాడేపల్లి



విద్యార్థికి విజ్ఞానం



డ్రోన్ సమ్మిట్ విజయవంతంగా నడిపించిన బృందాన్ని అభినందిస్తున్న ఉన్నతాధికారులు

అసాంఘిక శక్తుల అణిచివేతకే ఆయుధాల వినియోగం: ఎస్పీ

జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌజ్

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : ప్రజా రక్షణలో భాగంగా అసాంఘిక శక్తులను అణిచేసేందుకు పోలీసులు ఆయుధాలు వినియోగిస్తారని, సాంకేతిక పరికరాలు ఉపయోగించి నేర దర్యాప్తు చేస్తారని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు పురస్కరించుకుని ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం పోలీసు విధులపై అవగాహన పెంచుకుని విద్యార్థులు రక్షణ, పోలీసు శాఖలో సేవలు అందించాలని కోరారు. పేలుడు పదార్థాలు వాసన చూస్తే ఊపిరి తిత్తులు పాడవుతాయని, ఆ విధుల నిర్వహణలో పోలీసు జాగిలాలు ఆరేడు ఏళ్లకే మృతి చెందుతూ.. తమ జీవితాన్ని త్యాగం చేస్తున్న తీరును ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఆయుధాలు, సాంకేతిక పరికరాల పనితీరుపై విద్యార్థులకు డీఎస్పీ (ఏఆర్) గాంధీరెడ్డి, ఎంటీ ఆర్ఐ కృష్ణ, సంక్షేమ విభాగం ఆర్ఐ గోపినాథ్, అడ్మిన్ ఆర్ఐ రాజా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) సంతోష్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినికి రక్షణ కవచం తొడుగుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలి

అచ్చంపేట, అమరావతి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవి ఆదేశించారు. బుధవారం ఆయన అచ్చంపేట పీహెచ్‌సీని సందర్శించారు. వ్యాధినిరోధక టీకాల లక్ష్యాలు నూరుశాతం పూర్తి చేయాలని కోరారు. ల్యాబ్‌లో గర్భిణుల హెచ్‌బీ శాతం, కాన్పుల గది, ఫార్మసీ గది పరిశీలించారు. రోజువారీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. స్థానిక పీహెచ్‌సీలో గతనెల 3 ప్రసవాలు కాగా ఈనెలలో ఇప్పటి వరకు ఒక్క ప్రసవం జరిగిందన్నారు. ఉద్యోగులు సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. జిల్లా ప్రోగాం నోడల్ అధికారి డాక్టర్ డి.హనుమకుమార్, వైద్యులు ఎం.ఇన్నారావు, స్రవంతి, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, పార్వతి, శివనాగేశ్వరి, రాధాకృష్ణ తదితరులు ఉన్నారు. అలాగే అత్తలూరు పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి రవి సందర్శించి ఆసుపత్రిలో పిల్లల టీకాలు నిల్వ ఉంచే శీతల సామగ్రి, హాజరుపట్టిక, ఓపీ గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, పిల్లలకు సరైన సమయంలో టీకాలు వేసేలా సిబ్బందితో అవగాహన కల్పించాలని చెప్పారు.



అచ్చంపేట పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్ గదిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవి

పాఠశాలలో భోజన నాణ్యత పరిశీలన

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని కలెక్టర్ అరుణ్ బాబు చెప్పారు. బుధవారం బ్రాహ్మణపల్లిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, పిడుగురాళ్లలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. బ్రాహ్మణపల్లి పాఠశాలలో రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చి భోజన నాణ్యత వివరాలు అడిగారు. రోజు ఎంతమంది విద్యార్థులు భోజనం చేస్తారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి గదులను పరిశీలించారు. రోజూ ఎంతమంది రోగులు వస్తారు. ఏయే పరీక్షలు చేస్తారని వైద్యురాలు ప్రభావతిని అడిగారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మధుబాబు, ఎంఈవోలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

విద్యుత్తు శాఖకే షాక్ ఇచ్చారు..

చోరులు విద్యుత్తు శాఖకు షాక్ ఇచ్చారు. కావూరు- లింగంగుంట్ల ఉప కేంద్రం నుంచి గణపవరానికి ఏర్పాటు చేసిన విద్యుత్తు లైను తీగలను అపహరించారు. ఈ లైను ఏర్పాటు చేసినప్పటి నుంచి వినియోగించక పోవడంతో చోరులకు పని సులువైంది. సంబంధిత అధికారులు చర్య తీసుకోకపోవడంతో.. సొంతింటి దొంగల పనిగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

– న్యూస్‌టుడే, గణపవరం (నాదెండ్ల)



తీగలు అపహరించగా మిగిలిన ఖాళీ స్తంభం

అవకాశం చేజార్చుకోవద్దు

* ఆధార్ నవీకరణకు లక్షల మంది దూరం
* గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డు ఎంతో కీలకమైంది. ఆధార్ నవీకరణకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్షల మంది ఇంకా దూరంగా ఉన్నారు. నవీకరణ, నూతన నమోదు ప్రక్రియను శతశాతం పూర్తిచేయాలని ప్రభుత్వాలు భావిస్తుండగా చాలామంది నుంచి స్పందన కరువవుతోంది. ఈ నేపథ్యంలో వచ్చిన అవకాశాన్ని తల్లిదండ్రులు వదలకుండా పిల్లల ఆధార్ నవీకరించుకోవాల్సిన అవసరముంది. ఇప్పటివరకు ఆధార్ నమోదు చేయించుకోనివారు కూడా స్పందించాల్సి ఉంది. మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఉమ్మడి జిల్లాలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో పుర కమిషనర్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ శిబిరాలు నడుస్తున్నాయి.

బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయితేనే..

5 నుంచి 15 ఏళ్లలోపు వయసు బాలబాలికలు తప్పనిసరిగా ఆధార్ నవీకరించుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా 15 ఏళ్ల పైబడినవారు బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేయించుకుంటేనే వారికి సంక్షేమ పథకాలు అందుతాయి. అమ్మకు వందనం వంటి పథకాల లబ్ధిని అందుకోవాలంటే విద్యార్థుల ఆధార్ నవీకరణ తప్పనిసరిగా అధికారులు చెబుతున్నారు. ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించే ఆధార్ శిబిరాల సేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆధార్ నవీకరణ, కొత్తగా నమోదుకు దూరంగా ఉన్న వారి వివరాలు (అధికారిక గణాంకాలు)..

జిల్లా	5 నుంచి 15 ఏళ్లలోపు పెండింగ్	15 నుంచి 17 ఏళ్లలోపు పెండింగ్	మొత్తం
పల్నాడు	68,507	1,00,652	1,69,159
బాపట్ల	58,334	1,02,586	1,60,920
గుంటూరు	81,651	1,20,381	2,02,032



ఆధార్ నమోదు చేయించుకుంటున్న ప్రజలు

అప్పుల బాధతో ఇద్దరు కౌలు రైతుల బలవన్మరణం



గంగయ్య (పాత చిత్రం)



వేణుగోపాల్‌రెడ్డి (పాత చిత్రం)

అమరావతి, వెల్దుర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో అప్పులబాధ తాళలేక ఇద్దరు కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అమరావతి మండలం లింగాపురానికి చెందిన పెద్దిబోయిన గంగయ్య(26) మూడేళ్ల నుంచి పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. వాటిలో పత్తి, మిరప తోటలు వేయడంతో అప్పులు అధికమయ్యాయి. ఈ సంవత్సరం కూడా సుమారు ఎనిమిది ఎకరాలు పంట వేయగా ఆశాజనకంగా లేదు. అప్పులు తీర్చే మార్గం లేక బుధవారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అమరావతి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అలాగే మండల కేంద్రమైన వెల్దుర్తిలో వేణుగోపాల్‌రెడ్డి(65) అనే కౌలు రైతు తనకున్న ఎకరం పొలంతోపాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మూడేళ్ల నుంచి పత్తి, మిర్చి సాగులో కలిసిరాక అప్పులు పెరిగాయి. సుమారు రూ.20లక్షల వరకు అప్పులు అయ్యాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పురుగుమందు తాగాడు. భార్య లక్ష్మమ్మ గమనించి ఇరుగుపొరుగు సాయంతో ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. ఆయా ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్లాట్లు పొందిన వారికి వారంలో రిజిస్ట్రేషన్లు


ఈనాడు, అమరావతి: లాటరీలో రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు ఎటువంటి జాప్యం లేకుండా వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని సీఆర్డీఏ అదనపు కమిషనర్ సాయి సూర్య ప్రవీణ్‌చంద్ అన్నారు. బుధవారం సాయంత్రం విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ-లాటరీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించారు. అనంతరం వారికి కేటాయింపు పత్రాలను అందజేశారు. ఆయా గ్రామాల పరిధిలోని 23 మంది రైతులకు 68 కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్ల తాలూకా పత్రాలను ఇచ్చారు.



రైతుకు ప్లాట్ల కేటాయింపు పత్రం అందజేస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ సాయిసూర్య ప్రవీణ్‌చంద్

తెల్ల బంగారం వెలవెల

■ పత్తి పంటకు అధిక వర్షాల దెబ్బ
■ చేజారిన తొలికాపు



వర్షం నీటితో ఉరక దెబ్బకు గురైన పత్తి పంట

నరసరావుపేట టౌన్, గణపవరం (నాదెండ్ల), యడ్లపాడు, న్యూస్‌టుడే

అతివృష్టి అన్నదాతను అన్ని విధాలుగా నష్టపరిచింది. పంట చేతికి దక్కుతుందనుకుంటున్న వేళ కర్షకుని కష్టం బురద పాలైంది. ఎడతెరిపి లేని వర్షంతో పత్తి రైతులు కోలుకోలేని దెబ్బ తిన్నారు. జిల్లాలో దీపావళి పండగ తర్వాత పత్తి తీత పనులు ముమ్మరంగా సాగాల్సి ఉంది. అయితే ఈ లోపు వర్షాలతో పంటకు నష్టం జరిగింది. తొలి కాపు ఎకరాకు రెండు క్వింటాళ్ల నుంచి మూడు క్వింటాళ్ల వరకు తడిసి ముద్దగా మారింది. కాయలు కుళ్లిపోయి నల్లగా రంగు తిరిగాయి. బెట్ట వాతావరణంలో పక్వానికి వచ్చిన కాయలు పగిలి నాణ్యమైన పత్తి లభించేది. అయితే ఇప్పుడు పగుళ్లిచ్చిన కాయల్లోకి వాన నీరు చేరింది. గుడ్డి కాయలుగా మారడంతో పత్తి తీసేందుకు కూలీల ఖర్చు అధికమవుతోంది. దీనితో పాటు నాణ్యత లేక తక్కువ ధరకు పంట అమ్మాల్సి వస్తుంది. ఇక ఈ ఏడాది కూడా పత్తి పంట నష్టాల ఊబిలోకి ముంచుతుందని ఆందోళన చెందుతున్నారు.



కుళ్లిన పత్తి కాయలు



నాదెండ్ల మండలం సంకురాత్రిపాడుకు చెందిన కౌలు రైతు **తుళ్లూరి ప్రసాదు** 11 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నాడు. మరో పక్షం రోజుల్లో సుమారు 30 క్వింటాళ్ల పత్తి తీతకు వస్తుంది. ఇదంతా ఇప్పుడు తడిసి కాయలు కుళ్లిపోతున్నాయి. ప్రతి రోజు కురుస్తున్న వర్షానికి గూడ (పూత), పిందె రాలిపోయింది. మరో 40 క్వింటాళ్ల కాపు బురద నీటి పాలైంది. ముమ్మరం దిగుబడి వస్తుందన్న నమ్మకం లేదు. ఇతనే కాదు జిల్లాలో అనేక మంది పత్తి రైతుల పరిస్థితి ఇలానే ఉంది.


జిల్లాలో వర్షపాతం వివరాలు (మి.మీ)..

	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబరు	అక్టోబరు (15 వరకు)	మొత్తం
సాధారణం	80.9	131.0	139.8	134.5	72.5	558.7
నమోదైనది	103.2	124.8	139.4	223.0	103.2	693.6

ప్రతికూల వాతావరణం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రాంతం ఒకప్పుడు పత్తి సాగులో అగ్రగామిగా ఉండేది. చిలకలూరిపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు, గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లోని నల్ల భూముల్లో ఈ పంటను రైతులు ఇష్టంగా సాగు చేశారు. జిల్లాలో పత్తి సాధారణ విస్తీర్ణం 2,64,750 ఎకరాలు. దశాబ్ద కాలంగా అధిక వర్షాలు, గులాబీ రంగు పురుగు తాకిడి, తగ్గుతున్న దిగుబడుల ప్రభావంతో దీని సాగు గణనీయంగా కుదించారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూనే.. ఈ ఏడాది 1,62,590 ఎకరాల్లో పంట వేశారు. లక్ష ఎకరాలకు పైగా పంట తగ్గిపోయింది. కూలి, పెట్టుబడి కలిపి ఎకరాకు రూ.45 వేలు ఖర్చు చేశారు. సగటున 12 క్వింటాళ్ల వంతున పంట దిగుబడి వస్తేనే ఇది గిట్టుబాటు అవుతుంది. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల రీత్యా నాలుగైదు క్వింటాళ్లకు మించదని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం, నాదెండ్ల మండలం గణపవరంలో స్పిన్నింగ్ మిల్లులు అధికంగా ఉన్నాయి. ఏటా పత్తి బాగా పండితే ఇక్కడ వ్యాపారులు కొనేవారు. ప్రస్తుతం దిగుబడి తగ్గిపోవడంతో పత్తి ధరలు తగ్గే అవకాశం ఉంది. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మురళీ దృష్టికి తీసుకెళ్లగా.. అధిక వర్షాలు పత్తి పంటకు నష్టమేనన్నారు. నష్ట గణాంకాల సేకరణకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని, ఖరీఫ్ పత్తి సాగుకు వాతావరణ ఆధారిత బీమా వర్తించే అవకాశముందని పేర్కొన్నారు.

పశుగణనకు ప్రజలు సహకరించాలి: ఎంపీ



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు, కలెక్టర్ అరుణ్‌బాబు, కాంతారావు తదితరులు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : అఖిల భారత పశు గణన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బుధవారం రాత్రి 21వ కార్యక్రమ గోడపత్రికలు, కరపత్రాలు ఆయన కలెక్టర్ పి.అరుణ్ బాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు పశుగణన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్. కె.కాంతారావు మాట్లాడుతూ జిల్లాలో 364 రెవెన్యూ గ్రామాలు, 239 వార్డుల్లో గల 5,55,158 ఇళ్లలో 234 మంది గణకులు పశు గణన చేస్తారన్నారు. ప్రజలు పూర్తి సమాచారం అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ. మురళి తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి నేడు శంకుస్థాపన

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : రెండు జిల్లాలతో పాటు నాలుగు మండలాలను కలిపే హైలెవల్ వంతెనకు నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేయనున్నారు. ఇది వినుకొండ మండలం గోకనకొండ- నూజండ్ల మండలం పువ్వాడ మధ్యన గుండ్లకమ్మ నదిపై రూ.20 కోట్లతో ఏర్పాటు కానుంది. ఈ వంతెన ఏర్పాటుతో నూజండ్ల మండలవాసులు వినుకొండ మండలం, పట్టణంతో పాటు బాపట్ల జిల్లాకు, గుంటూరుకు సులువుగా వెళ్లడానికి వీలు కలుగుతుంది. కార్యక్రమంలో విద్యుత్తు శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొననున్నారు.

వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీనామా

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పల్నాడు జిల్లాలో వైకాపాకు షాక్ తగిలింది. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు డాక్టర్ మక్కెన అచ్చయ్య ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతో వైకాపాకు దూరం అవుతున్నట్లు తెలిపారు. ఈమేరకు తన రాజీనామా ఆమోదించాలని కోరుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి పంపిన లేఖను బుధవారం విలేకరులకు అందజేశారు.

అమరేశ్వర ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ

అమరావతి, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం కార్యనిర్వహణాధికారిగా సునీల్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఈవో గోపీ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో సునీల్‌కుమార్ నియమితులయ్యారు. గతంలో నాలుగేళ్ల పాటు సునీల్‌కుమార్ ఇక్కడ ఈవోగా బాధ్యతలు నిర్వహించారు. మళ్లీ రెండో సారి అమరేశ్వరాలయ ఈవోగా నియమితులయ్యారు.

పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరులోని రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. చిలకలూరిపేటకు చెందిన ఓ బాలిక శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో వసతి గృహంలో ఉంటూ 8వ తరగతి చదువుతోంది. మంగళవారం రాత్రి స్కూల్ నుంచి ఫోన్ చేసి మీ పాపకు సీరియస్‌గా ఉందని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించామంటే హడావుడిగా బయల్దేరామని తండ్రి పేర్కొన్నారు. మళ్లీ కొద్దిసేపటికి పాప చనిపోయిందని చెప్పారన్నారు. తన కుమార్తె ఎలా చనిపోయిందని అడుగుతుంటే స్కూల్ వసతి గృహంలో చున్నీతో ఉరి వేసుకొందన్నారని, తర్వాత ఒక్కొక్కరు ఒక్కో రకంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. యాజమాన్యంతో మాట్లాడాలని ప్రయత్నించినా అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థిని కుటుంబ సభ్యులు, బంధువులు, ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం పాఠశాల ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. నల్లపాడు సీఐ వంశీధర్ ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాలిక మృతిపై తల్లి దండ్రులు ఫిర్యాదు చేశారని, మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు విచారణ చేస్తామని సీఐ తెలిపారు.

చిలకలూరిపేటలో విషాదం

చిలకలూరిపేట పట్టణం, గ్రామీణ : విద్యార్థిని మృతితో చిలకలూరిపేటలో విద్యార్థిని తల్లిదండ్రులు నివసిస్తున్న ప్రాంతంలో బుధవారం విషాదం అలుముకుంది. అందరితో కలివిడిగా ఉండే బాలిక ఇకలేదు అనే వార్త తెలియడంతో బంధువులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. మూడు దశాబ్దాల క్రితం ఉమ్మడి ప్రకాశం జిల్లా యద్దనపూడి మండలం పూనూరు నుంచి వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులు వలస వచ్చారు. ఇక్కడే కష్టపడి పని చేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. కుమారుడు పదో తరగతి చదువుతుండగా కుమార్తెను గుంటూరులో చేర్పించారు. బాగా చదువుకుంటున్నారనుకుంటున్న తరుణంలో కూతురి మృతితో వారు తల్లడిల్లారు. వారు ఉంటున్న వీధిలో విషయం తెలిసి విషాదం అలముకుంది.

వృద్ధుడి ధైర్యం.. దొంగలు పరారీ

అద్దెకు ఇల్లు కావాలంటూ చోరీ యత్నం



ఇంట్లో నుంచి బయటకు వస్తున్న దొంగతానికి వచ్చినవారు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: అద్దెకు ఇల్లు కావాలంటూ చోరీకి యత్నించిన దొంగలు వృద్ధుడి ధైర్యంతో పరారయ్యారు. ఈ సంఘటన పట్టణంలో మంగళవారం జరిగింది. బాధిత కుటుంబం, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో తూనుగుంట్ల సీతారామయ్య(సీతయ్య), సీత వృద్ధ దంపతులు నివాసం ఉంటున్నారు. వారి ఇంటి పైపోర్షన్ ఖాళీగా ఉంది. టూలెట్ బోర్డు పెట్టి ఉండటంతో పట్టణానికి చెందిన సత్తి కుమార్‌రెడ్డి, రాజుపాలెం మండలంలోని గణపవరానికి చెందిన యరసాని నానిలు ఇంటి లోపలకు వెళ్లారు. ఫైనాన్స్ కార్యాలయం పెట్టుకుంటామంటూ సీతయ్యను అద్దెకు అడిగారు. తాను కుటుంబానికి తప్పించి వేరే వాటికి అద్దెకు ఇవ్వనని చెప్పారు. దీంతో వారు వెళ్లిపోయారు. కాసేపటికి వారిద్దరితోపాటు పట్టణానికే చెందిన మర్రి అమ్మయ్యను వెంట తీసుకొచ్చారు. కుటుంబానికి ఇల్లు అద్దెకు కావాలంటూ పైకి వెళ్లారు. ఇంటి తాళం తీయించి గదులన్నీ కలియ తిరిగారు. అద్దె విషయంలో బేరమాడారు. ఈ క్రమంలో ముగ్గురు కలసి సీతయ్యపై దాడిచేసి నగదు, బంగారం చోరీ చేయాలని ప్రయత్నించారు. వృద్ధుడు వారిని ప్రతిఘటించి గట్టిగా కేకలు వేయడంతో బైక్‌ను వదిలేసి అక్కడి నుంచి పరారయ్యారు. సీతయ్య ఇంటి ముందు సీసీ టీవీ ఫుటేజీలో రికార్డు అయిన దృశ్యాలను చూసి పోలీసులు కుమార్‌రెడ్డి, అమ్మయ్యలను అదుపులోకి తీసుకున్నారు. నాని కోసం గాలిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు బలోపేతం

చిరుమామిళ్ల (నాదెండ్ల), న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు మెడల్ మేకింగ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ వంటి అధునాతక పద్ధతులపై అవగాహన పెంచుకుని, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను బలోపేతం చేసుకోవాలని విద్యాశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. నాదెండ్ల మండలం చిరుమామిళ్ల ఏపీ ఆదర్శ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. దీనికి హాజరైన డీఈవో మాట్లాడుతూ.. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలతో విద్యార్థుల్లో ఆవిష్కరణ నైపుణ్యం పెంపొందించాలన్నారు. శిక్షణ పొందిన 36 మంది ఉపాధ్యాయులకు ధ్రువపత్రాలు అందజేశారు. డీఈవోను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, ప్రధాన అధ్యాకురాలు ఝాన్సీవాణి, ఉపాధ్యాయులు రోజా రమణి, మధు కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యమిత్రల సమస్యలు పరిష్కరించండి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో వైద్యమిత్రలకు కనీస వేతనం, ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా వైద్యమిత్రల సంఘ నేతలు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. 17 ఏళ్లుగా పని చేస్తున్నా నెలకు రూ.15 వేలు మాత్రమే వేతనంగా ఇస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదని, ఉద్యోగ భద్రత కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పని చేస్తున్న కాలాన్ని పరిగణనలోకి తీసుకుని ఒప్పంద ఉద్యోగులుగా తీసుకుని కనీస వేతనాలు ఇప్పించాలని కోరారు. సంఘ నేతలు సాయిబాబు రాజు, అప్పారావు, సుధాకర్, శివనాగేశ్వరరావు ఉన్నారు.

గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు కేంద్రం సన్నద్ధం



మాట్లాడుతున్న ఏఐఆర్‌ఆర్‌బీఈఏ నేత వెంకటేశ్వరరెడ్డి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు కేంద్రం సన్నద్ధమవుతుందని ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్స్ ఉద్యోగుల సంఘ నేత ఎస్.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని వెంకటేష్ గ్రాండ్‌లో బుధవారం ఏఐఆర్‌ఆర్‌బీఈఏ సమావేశం జరిగింది. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ క్రమంలో కేంద్రం గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు ముందుకు రానుందన్నారు. ఏఐఆర్‌ఆర్‌బీఈఏ కృషితో వాణిజ్య బ్యాంకులతో సమానంగా ఇతర అలవెన్సులు కూడా సాధించామన్నారు. తొలుత చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును సంఘ నేతలు సందర్శించి బ్యాంకు ఛైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో సీజీజీబీ అధికారుల సంఘ ప్రధాన కార్యదర్శి బోడా శ్రీనివాసరావు, అధ్యక్షుడు సీహెచ్.వెంకట్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ మజీద్, సీజీజీబీ స్టాఫ్ ఫెడరేషన్ కార్యదర్శి సీహెచ్.యమలయ్య, కోశాధికారి మూర్తి, అధ్యక్షుడు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి బలవన్మరణం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : మద్యానికి బానిసై భార్యతో గొడవపడి ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్సై శ్రీనివాసనాయక్ వివరాల మేరకు.. నరసరావుపేట మండలం తురకపాలేనికి చెందిన గోపరాజు (30) అదే గ్రామానికి చెందిన ఆదిలక్ష్మితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన గోపరాజు తరచూ భార్యతో గొడవపడేవాడు. మంగళవారం గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. నరసరావుపేట- సాతులూరు రైల్వేస్టేషన్ల మధ్యలో క్రిస్టియన్‌పాలెం సమీపంలోని రైల్వే ట్రాక్‌పై అమరావతి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న నరసరావుపేట రైల్వే పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి అమ్మాయి, అబ్బాయి ఉన్నారు.

బాలికను తీసుకెళ్లిన వ్యక్తిపై ఫోక్సో కేసు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : ప్రేమ పేరుతో బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసిన వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఈవెంట్ కార్యక్రమాల్లో నృత్య ప్రదర్శకురాలిగా పని చేస్తోంది. ఈ క్రమంలో వినుకొండ మన్నేపల్లి తండాకు చెందిన వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. ప్రేమ పేరుతో ఆమెను వేధిస్తుండటంతో బాలిక కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఇంటి దగ్గరనున్న బాలికను సోమవారం కిడ్నాప్ చేశాడు. ఈ మేరకు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయిని కొడతారని..


ఆర్టీసీ బస్సెక్కి పిడుగురాళ్లకు చేరిన విద్యార్థులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పాఠశాలలో ఇచ్చిన హోంవర్కు పూర్తి చేయకపోవడంతో టీచర్ కొడుతుందని ఇద్దరు విద్యార్థులు బుధవారం బడి బస్సు ఎక్కకుండా, ఆర్టీసీ బస్సెక్కి పిడుగురాళ్లకు వచ్చారు. దుకాణాల వద్ద తిరుగుతుండగా వ్యాపారులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు. గుంటూరు నగరపాలెం ప్రాంతానికి చెందిన ఎస్.కె.అబ్దుల్‌ఖాదర్, సయ్యద్ మహ్మద్‌నిహార్‌లు స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నారు. పాఠశాలలో మంగళవారం టీచరు హోంవర్కు ఇచ్చారు. ఇద్దరూ చేయలేదు. పాఠశాలకు వెళితే టీచరు కొడుతుందని ఇద్దరూ భయపడి పాఠశాలకు వెళ్లకుండా, ఆర్టీసీ బస్సెక్కి పిడుగురాళ్ల పట్టణంలోని ఐలాండ్ సెంటరుకు వచ్చారు. దుకాణాల వద్ద విద్యార్థులు తిరుగుతుండగా వ్యాపారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఎం.మోహన్ వచ్చి పిల్లలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్సై మోహన్‌లు పిల్లలను విచారించి వారి తల్లిదండ్రుల పేర్లు, అడ్రసు అడిగి తెలుసుకొన్నారు. వారిని పోలీసుస్టేషన్‌కు రప్పించి పిల్లలను అప్పగించారు.

దారిలోనే ఎదురొచ్చిన మృత్యువు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : వినుకొండ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చీరాలలో సముద్ర స్నానానికి బయల్దేరి మార్గమధ్యలో డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. గ్రామీణ పోలీసులు, స్థానికుల కథనం మేరకు వినుకొండ ప్రాంతానికి చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు (35), శ్యాంకుమార్, రామాంజనేయులు ద్విచక్ర వాహనంపై చీరాలకు బయల్దేరారు. మార్గమధ్యలో కోటప్పకొండ సమీపానికి రాగానే ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో తిరుమలశెట్టి శ్రీనివాసరావు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందగా శ్యాంకుమార్, రామాంజనేయులకు తీవ్రగాయాలవటంతో నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గ్రామీణ ఎస్సై కిషోర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా మృతుని స్వగ్రామం తిమ్మాయపాలెంగా పోలీసులు గుర్తించారు.

పట్టు బిగించిన టీం- బి జట్టు



ఆరు వికెట్లు సాధించిన టీం-బి బౌలర్ అక్షిత్‌రెడ్డి

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో అండర్- 19 రాష్ట్ర ప్రాబబుల్స్ క్రికెట్ పోటీల్లో రెండో రోజు టీం- బి జట్టు పట్టు బిగించింది. విజయానికి బాటలు వేసుకుంది. బుధవారం 5 వికెట్ల నష్టానికి 150 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండోరోజు బ్యాటింగ్ చేపట్టిన టీం- బి జట్టు 64 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని గౌతమ్‌కృష్ణ 48 పరుగులు చేశాడు. టీం- ఎ బౌలర్ నాగ కుళ్లాయప్ప మూడు వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్ టీం- బి జట్టు 76 పరుగుల అధిక్యం సాధించింది. అనంతరం టీం- ఎ తన రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించి 59.4 ఓవర్లలో 246 పరుగులు చేసింది. జట్టులోని రాజేష్ 47 పరుగులు చేశాడు. టీం- బి బౌలర్ అక్షిత్‌రెడ్డి 6 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన అధిక్యం పోనూ 170 పరుగుల విజయ లక్ష్యంతో టీం- బి జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించి ఆట ముగిసే సమయానికి 6 ఓవర్లలో వికెట్ నష్టానికి 14 పరుగులు చేసింది. విజయానికి 157 పరుగులు చేయాల్సి ఉండగా గురువారం ఆట మిగిలి ఉంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, 142, 153 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శావల్యాపురం : మండలంలోని ఇర్లపాడులో ద్విచక్ర వాహనదారుకు ఎదురుగా గేదెలు ఎదురు రాగా వాహనం అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు వివరాల ప్రకారం .. గ్రామానికి ఆరుమళ్ల లక్ష్మయ్య ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా గేదెలు ఎదురు వచ్చాయి. దీంతో అదుపు తప్పి రోడ్డు మీద పడగా తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో పోర్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పంచాయతీలకు సర్‌ఛార్జి నిధులు ఇవ్వాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలోని పంచాయతీలకు బకాయిలు ఉన్న సర్‌ఛార్జి నిధులు విడుదల చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర పంచాయతీ పరిషత్ ఛైర్మన్ జాస్తి వీరాంజనేయులు కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 518 పంచాయతీల్లో నిధుల కొరత ఎదుర్కొంటున్నాయని, ఆరునెలలుగా రిజిస్ట్రేషన్లపై పంచాయతీలకు రావాల్సిన సర్‌ఛార్జి నిధులు విడుదల కావడం లేదని పేర్కొన్నారు. అలాగే తలసరి గ్రాంట్లు, వృత్తి పన్నులు సైతం రావడం లేదని వివరించారు. నిధులు వస్తే పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుందని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని కోరారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

సర్వే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

నూజెండ్ల, న్యూస్‌టుడే : రీసర్వేలో ప్రతి సమస్యను రికార్డు చేసి వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని ఆర్డీవో మధులత అన్నారు. తంగిరాలలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీసర్వే లోపాల్ని గుర్తించాలని, ప్రతి గ్రామ సభలో వచ్చిన ఫిర్యాదుల్ని రికార్డుల్లో నమోదు చేయాలని పేర్కొన్నారు. గ్రామ సభలకు వీఆర్వో, సర్వేయర్ హాజరయ్యేలా చూడాలని తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. కార్యాలయానికి వచ్చే వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట టౌన్: 80085 73151
చిలకలూరిపేట: 8008552562 వినుకొండ : 8008573164

? నరసరావుపేట పట్టణ బాలయ్య నగర్ మూడోలైన్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ వీధి కుక్కలతో ఇబ్బందిగా ఉంది. -వి.ఎన్.ఎన్.మూర్తి, స్థానికుడు

✔ సిబ్బందికి తెలియజేసి వీధి దీపం అమర్చుతాం.
- కె.శేఖర్, వీధి దీపాల నిర్వహణాధికారి న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట),

? నూజెండ్ల రోడ్డులో అండర్ పాస్‌కు మార్కాపురం ప్రధాన రహదారికి మధ్యలో అప్రోచ్ సిమెంట్ కాంక్రీట్ వేస్తామని మట్టి పోసి వదిలేశారు. -రామయ్య

✔ నిధుల వెసులుబాటు చూసుకుని అప్రోచ్‌తో పాటు కాలువ నిర్మిస్తాం. -సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ కమిషనర్, వినుకొండ

? రైల్వేస్టేషన్ రోడ్డులో అమ్మవారి గుడి వద్ద వీధిదీపం వెలగడం లేదు. - స్థానికులు

✔ నేరుగా విద్యుత్తు లైన్‌కు కనెక్షన్ ఇచ్చినందున విద్యుత్తు శాఖ సిబ్బందిని ఎల్ఈ అడిగాం. వస్తూనే బల్బు బిగిస్తాం.
- గంట జానీ, మున్సిపల్ ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్, వినుకొండ న్యూస్‌టుడే, వినుకొండ

? రొంపిచర్ల జడ్పీ పాఠశాల వెనుక పోలీసు క్వార్టర్స్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతో ఇబ్బంది పడుతున్నాం. -రొంపిచర్ల గ్రామస్థులు

✔ లైన్‌మెన్‌ను పంపి సమస్య పరిష్కరిస్తాం.
-రాంబాబు, ఏఈ విద్యుత్తు శాఖ న్యూస్‌టుడే, రొంపిచర్ల

నాటిన ప్రతి మొక్క బతికితే లక్ష్యం పూర్తి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : నాటిన ప్రతి మొక్క బతికినప్పుడే లక్ష్యం నెరవేరుతుందని బెంగళూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐ.డబ్ల్యు.ఎస్.టి.) నోడల్ అధికారి డాక్టర్ దివాకర్ అన్నారు. బుధవారం వినుకొండ మండలం నీలగంగవరం, బొల్లాపల్లి మండలం కనుమలచెరువు, బ్రిడ్జి తండా, రావులాపురం, ఈపూరు మండలం భద్రుపాలెంలో అటవీ క్షేత్ర పర్యటన, సర్వే చేశారు. 2016- 17, 2018- 19 ఏడాదిలో నాటిన మొక్కల లెక్కింపు అవి ఎలా ఉన్నాయో పరిశీలించి కొలతలు తీశారు. 95 శాతం మొక్కలు బాగా ఉన్నాయని గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీవో డాక్టర్ నారాయణ, ఎంటీఎస్ డాక్టర్ నవాజ్, వినుకొండ రేంజర్ మాధవరావు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



వినుకొండ : జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద చెత్త పోసే డబ్బాల వద్ద అపరిశుభ్రత

ఎక్కడ పడితే అక్కడే

✤ మూత్ర విసర్జనకు మరుగుదొడ్లు కరవు ✤ పురపాలక సంఘాల్లో ఇబ్బందులు

వినుకొండ, న్యూస్‌టుడే

పట్టణంలో ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేయడం వల్ల అపరిశుభ్రత నెలకొంది. జన సంచారం ఉన్నప్పటికీ కాసింత మరుగు కనిపిస్తే అక్కడే కానిస్తున్నారు. పురపాల సంఘంలో నాలుగు చోట్ల డబ్బులు చెల్లించే పద్ధతిలో మరుగుదొడ్లు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మరొకటి ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ మల విసర్జనకు తప్ప మూత్ర విసర్జనకు సదుపాయం లేనందున ఆరు బయటే చేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. చాలా విద్యాసంస్థల్లో ఈ సదుపాయం లేనందున విద్యార్థులు ఆరు బయటకు వస్తున్నారు. వీరితో పాటు ప్రతి రోజు పట్టణానికి వచ్చే సందర్శకుల సంఖ్య ఎక్కువే. వీళ్లంతా అత్యవసరం అయితే ఆరు బయటే చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో ఈ దుర్గంధం తట్టుకోలేక, వచ్చిన వారిని ఆపలేక గోడలకు దేవుళ్ల ఫొటోలు పెట్టి ఆపే ప్రయత్నం చేస్తున్నారు. కీర్తి థియేటర్, చేప బిల్డింగ్ ఎదురు బజారు ఇతరత్రా పలు చోట్ల ఇదే పని చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే కారంపూడి రోడ్డు, సురేష్‌మహల్ పరిసర ప్రాంతాల్లో, ముల్లమూరు బస్టాండ్ వైపు మురుగు కాలువపై ప్రత్యేకంగా మూత్ర విసర్జనశాలలు ఏర్పాటు చేస్తే బహిరంగ మూత్ర విసర్జన నిరోధించవచ్చు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలో నాలుగే

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నరసరావుపేట కేంద్రంగా జిల్లా ఏర్పాటై రెండేళ్లు దాటింది. ప్రజలకు మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. నరసరావుపేట జనాభా 1.50 లక్షలు దాటింది. జిల్లా కేంద్రమైన తర్వాత ఉన్నత అధికారుల కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటు చేశారు. పనుల నిమిత్తం రోజుకు 10 వేల మందికిపైగా ప్రజలు జిల్లా నలుమూలల నుంచి పట్టణానికి వస్తుంటారు. ఆ ప్రాతిపదికన సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. నరసరావుపేటలో నాలుగు మాత్రమే ఉన్నాయి. పల్నాడు రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, వినుకొండ రోడ్డులో ఎక్కడా ఏర్పాటు చేయలేదు. దీంతో మూత్ర విసర్జన చేయాలంటే ఇంటికి తిరిగి వెళ్లే వరకు ఆపుకోవడం లేకుంటే రోడ్డు పక్కనే కానిచ్చేయడం చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపించి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. పల్నాడు బస్టాండ్ ప్రాంతంలో ప్రైవేటు వైద్యశాలలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే రిలయన్స్ తదితర పెద్ద వ్యాపార సంస్థలు, దుకాణ సముదాయాలు ఉన్నాయి. వీటికి రోజుకు వేలసంఖ్యలో సందర్శకులు వస్తున్నారు. పురుషుల కంటే మహిళల పరిస్థితి దారుణంగా ఉంటుంది. అలాగే రొంపిచర్లకు వెళ్లే మార్గంలో కలెక్టరేట్ ఉంది. నిత్యం 30 గ్రామాల ప్రజలు ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటారు. అవసరాలకు రైల్వే స్టేషన్ పరిసరాలను వినియోగిస్తున్నారు.



నరసరావుపేట : హోల్‌సేల్ మార్కెట్ వద్ద నిరుపయోగంగా సులభ్ కాంప్లెక్స్



చిలకలూరిపేట : నిరుపయోగంగా పోలిరెడ్డిపాలెం వద్ద సామాజిక మరుగుదొడ్డు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేట పట్టణ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా పట్టణంలో మరుగుదొడ్ల సౌకర్యం లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 1.05లక్షలు ఉండగా, ప్రస్తుతం 1.50 లక్షలకు చేరింది. దానికి అనుగుణంగా మరుగుదొడ్ల నిర్మాణం కొన్ని కూడళ్ల వద్ద చేపట్టలేదు. 2014- 19లో అప్పటి తెదేపా ప్రభుత్వం సమస్య గుర్తించి పలు కూడళ్ల వద్ద మరుగుదొడ్లు ఆధునికంగా నిర్మించింది. పోలిరెడ్డిపాలెం వద్ద రహదారి పక్కన ఉన్నవారు బహిరంగ మలవిసర్జన చేయకుండా ఉండేందుకు సామాజిక మరుగదొడ్లు నిర్మించారు. కానీ గత వైకాపా ప్రభుత్వంలో వాటిని పట్టించుకోక నిరుపయోగంగా మారాయి. తహసీల్దార్ కార్యాలయంలో మరుగుదొడ్లు మూలనపడ్డాయి. ఆర్‌వీఎస్ సీవీఎస్ పాఠశాల ప్రాంతంలో కొత్తగా మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది.

సృజనలో పోటీపడ్డారు..

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : 'ఈనాడు' ఆధ్వర్యంలో చిలకలూరిపేట పట్టణంలోని ప్రసన్నలక్ష్మి విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్‌నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలు ఎం.పల్లవి, ఎం.రమ్యశ్రీ, వి.పూర్ణచంద్రరావుకు పాఠశాల హెచ్ఎం ఎ.సుబ్బారావు, ఇన్‌ఛార్జి ఎ.జ్యోతి బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు.

✤ 'ఈనాడు' ఆధ్వర్యంలో చిలకలూరిపేట పురుషోత్తమపట్నంలోని ఎస్.పి.టి.ఆర్.కె.ఎం. ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్‌నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలైన ఎస్.కె.సాఫియా, ఎస్.కె.ముష్రిఫా పాతిమా, కె.శిరీషకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రిన్సిపల్ పి.శ్యాంసుందర్ అందజేశారు. ఉపాధ్యాయులు ఎస్‌కే సాధిక్, ఎం.పూర్ణచంద్రరావు, ఐ.హరికృష్ణ పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం సుబ్బారావు, ఇన్‌ఛార్జి జ్యోతి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ శ్యాంసుందర్, పక్కన ఉపాధ్యాయులు

కార్యాలయంలోకి వెళ్లేదెలా?

క్లిక్... క్లిక్



నరసరావుపేట వెళ్లే ప్రధాన రహదారి నుంచి మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి వెళ్లాలంటే బురద నీటిని దాటి వెళ్లాల్సిందే. వర్షపు నీటితో పాటు క్యాంటీన్‌లో వాడిన నీరు బయటకు వెళ్లేందుకు కాలువ సక్రమంగా లేక దారిలోనే నీళ్లు నిలబడి బురదవుతోంది. మహిళా సిబ్బంది ఇబ్బందిని ఏకరవు పెడుతున్నారు. ఇదే ప్రాంగణంలో న్యాయవాదుల సంఘ భవనం ఉన్నందున వారికీ ఇదే సమస్య ఎదురవుతోంది. -వినుకొండ, న్యూస్‌టుడే

రుసుం వసూలు సరే.. నీడేది?



వినుకొండ రైల్వేస్టేషన్‌లో వాహనాల స్టాండ్ ఆరు బయట ఏర్పాటు చేశారు. పక్కా నిర్మాణాలు లేనందున వానకు వాహనాలు తడుస్తున్నాయి. కాంట్రాక్టర్లు మాత్రం అద్దె ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. గతంలో రేకుల షెడ్డుగా ఉన్న స్టాండ్ తొలగించి ప్రత్యామ్నాయంగా మరొకటి నిర్మించనందున వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. -వినుకొండ, న్యూస్‌టుడే

సమస్యలు పరిష్కరించాలి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : కస్తూర్బా విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ నిర్వహణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరారు. మండలంలోని పోతవరం కస్తూర్బా విద్యాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. పిల్లలకు అందించే ఆహారం, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. పిల్లలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు వివరించి పరిష్కరించాలని కోరారు.



చెట్టు కొమ్మల మధ్య విద్యుత్తు తీగలు

ఇరుకుదారుల్లో.. ట్రాఫిక్ సమస్యలు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : నిత్యం జనంతో రద్దీగా ఉండే నరసరావుపేట అరండల్‌పేటలో ఇరుకు రహదారులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ బ్యాంకు వీధి, మోర్ సెంటర్, ప్రధాన వాణిజ్య కేంద్రాలు ఉండటంతో నిత్యం ప్రజలు వస్తుంటారు. అయితే ఈ మార్గాల్లో ద్విచక్ర వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. ఎక్కడా పార్కింగ్ స్థలాలు లేక దుకాణాల ఎదుట వాహనాలు నిలపాల్సి వస్తోంది. దీంతో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ సీఐ లోకనాథం తెలిపారు. చెట్ల మధ్య విద్యుత్తు తీగలు ఉన్నాయి. దీంతో స్థానికులు భయపడుతునానరు. అరండల్‌పేటలో మురుగు, చెత్త సమస్య వేధిస్తోంది. భూగర్భ మురుగు వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నెలలో రెండుసార్లు తీయాల్సిన మురుగు పూడిక సమయానికి తీయడం లేదని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే తూతూమంత్రంగా పూడిక తీయటం వల్ల కాలువలో మురుగు పేరుకుని దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు తెలిపారు. అధికారులు సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



మోర్ సెంటర్ రోడ్డులో ఉంచిన ద్విచక్ర వాహనాలు

అదుపు తప్పి కారు బోల్తా

ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: విజయవాడ నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఒకరు మృతి చెందంగా..ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. నల్లపాడు పోలీసుల వివరాల మేరకు.. యడ్లపాడు మండలం సొలసకు చెందిన కొండెపోగు అంకమ్మరావు(32), షేక్ నజీర్ కారులో సత్తుపల్లి వెళ్లి డ్రోన్ కెమెరాలు మరమ్మతులు చేయించుకుని చిలకలూరిపేటకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు గుంటూరు గ్రామీణం పరిధిలోని బుడంపాడు వద్ద అదుపుతప్పి జాతీయ రహదారి పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొట్టి సర్వీస్ రోడ్డులోకి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో అంకమ్మరావు అక్కడికక్కడే మృతి చెందగా..డ్రైవర్ షేక్ మౌలాలి, నజీర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని, క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య కమలకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ వంశీధర్ తెలిపారు.

బావపై దాడి.. కేసు నమోదు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : చెల్లెల్ని మద్యం తాగి కొడుతున్నాడని బామ్మర్దిని వారించినందుకు అతను దాడి చేశాడు. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి ఇది జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నరసరావుపేట శ్రీరాంపురానికి చెందిన తిరుమలగుడి సాయిరాం తన చెల్లెలిని వెంకటగిరికి చెందిన యశోదర సాయికి ఇచ్చి 2015 వివాహం జరిపించారు. వీరు కొన్నేళ్ల క్రితం నరసరావుపేట శ్రీరాంపురంలో ఉండేందుకు క్రితం వచ్చారు. కానీ యశోదర సాయి మద్యానికి బానిస అయ్యాడు. మంగళవారం మద్యం తాగి వచ్చిన సాయి భార్యను కొట్టగా సాయిరాం వారించాడు. దీంతో ఇంటిలో ఉన్న కత్తెరతో బామ్మర్ది దాడి చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లో ఓ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్సై వంశీకృష్ణ బుధవారం తెలిపారు. ఫిరంగిపురం మండలానికి చెందిన ఆమె నిత్యం కళాశాలకు బస్సులో వస్తుంటుంది. మంగళవారం కళాశాలకు వచ్చిన ఆమె రాత్రయినా రాకపోయేసరికి బాలిక తండ్రి జగన్నాథం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు సూచించారు. ఓటరు నమోదులో భాగంగా పట్టణంలో 18, 24వ వార్డుల్లో తెదేపా శిబిరాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు రాజ్యాంగం ప్రత్యేకంగా తమ ప్రతినిధిని ఎంచుకునే అవకాశం కల్పించిందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుని మంచి ప్రతినిధిని ఎన్నుకునేందుకు నవంబరు 6 లోగా ఓటుహక్కుకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మంచి ప్రభుత్వానికి పట్టభద్రులు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్, కనుమూరి లక్ష్మీ, రావెళ్ల నాగేశ్వరరావు, వాసిరెడ్డి రవి ఉన్నారు.



దరఖాస్తులు చూపుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : పట్టణంలోని 60 అడుగుల రోడ్డులో పారిశుద్ధ్య పనులను ఎమ్మెల్యే అరవిందబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలో ఎక్కడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకూడదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం సీబీఐటీ పాఠశాల సమీపంలో నూతన కాలువల నిర్మాణ పనులను పరిశీలించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థినులకు ఉద్యోగాలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ఎంఎఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు తెలిపారు. బెంగళూరుకు చెందిన అకాడెమోర్ సంస్థ కళాశాలలో ప్రాంగణంలో ఎంపికలు నిర్వహించింది. విద్యార్థినులకు రాతపరీక్ష, బృందచర్చ, మౌఖిక పరీక్షలు నిర్వహించింది. 42 మంది విద్యార్థినులను ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేశారు. వీరికి ఆరు నెలలు రూ.25 వేలు ఉపకార వేతనంతో కూడిన శిక్షణ ఇస్తారు. తర్వాత వార్షిక వేతనం రూ.6 లక్షలు ఉంటుంది. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను కళాశాల ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ఉపాధి కల్పన విభాగాధికారి రవిశంకర్ అభినందించారు.



విద్యార్థినులతో కళాశాల ఛైర్మన్ ఎమ్మార్ శేషగిరిరావు, డైరెక్టర్ శ్రావ్యలు

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

నూజండ్ల, న్యూస్‌టుడే : పువ్వాడ పంచాయతీ పరిధిలోని కొత్త కొత్తపాలెంలో బుధవారం వేకువన జూదమాడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,31,300, మూడు ద్విచక్ర వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణారావు తెలిపారు.

గ్రీన్‌బోర్డు వితరణ

యడ్లపాడు : మండలంలోని జాలాది ప్రాథమిక పాఠశాల (ఎచ్ఈ)కు అదే గ్రామానికి చెందిన జరుగుల సుధారాణి రూ.12 వేల విలువైన రెండు గ్రీన్‌బోర్డులు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో ఎంవీ నాగరత్నం మాట్లాడుతూ సుధారాణి దాతృత్వం అభినందనీయమని కొనియాడారు. హెచ్ఎం ఎన్.మునియ్య, ఉపాధ్యాయిని కీర్తి, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ పాల్గొన్నారు.

సీపీఎం మండల కన్వీనర్‌గా సరికొండ

రొంపిచర్ల : రొంపిచర్ల మండల సీపీఎం కన్వీనర్‌గా సరికొండ వెంకటేశ్వరరాజును జిల్లా సీపీఎం నేత జి.రవిబాబు బుధవారం ప్రకటించారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

సోలార్ శక్తిపై ఉచిత శిక్షణ

వినుకొండ, న్యూస్‌టుడే : నిరుద్యోగ యువతకు సౌరశక్తిపై సూర్యమిత్ర పేరుతో మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆషా సొసైటీ డైరెక్టర్ కరీముల్లా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా గోడప్రతులు విడుదల చేశారు. ఏపీ న్యూ రెన్యూవబుల్ ఎనర్జి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ, ఇంటర్ పూర్తి చేసినవారు శిక్షణకు అర్హులని చెప్పారు. శిక్షణ అనంతరం స్కిల్ కౌన్సిల్ ఫర్ గ్రీన్ జాబ్స్ సంస్థతో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. మూడు నెలలు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

అవీ ఇవీ

అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి

నూజండ్ల, న్యూస్‌టుడే : నూజండ్ల సెక్టార్‌లో అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డి కోరారు. జేసీనగర్, గాంధీనగర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు లలితకుమారి, లక్ష్మీ పావనిని తొలగించాలని తెదేపా గ్రామనేతలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. దీనిపై బుధవారం నూజండ్ల బస్టాండ్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. వారిని అన్యాయంగా తొలగించవద్దని కోరారు. జిల్లా, మండల కార్యదర్శులు ప్రసన్నకుమారి, సీతారామయ్య, లక్ష్మీ పావని, లలితకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వ విద్యాలయ జట్టుకు ఎంపిక

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏఎన్‌యూ విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 20, 21 తేదీల్లో విశ్వ విద్యాలయంలో అంతర కళాశాలల పురుషుల బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారని తెలిపారు. పోటీల్లో రాణించి బి.సూర్యకిరణ్, పృథ్వీ సాయి మణికంఠ జట్టులో చోటు సాధించారని పేర్కొన్నారు. తమిళనాడులోని ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయంలో నిర్వహించే దక్షిణ భారత అంతర విశ్వ విద్యాలయాల పోటీల్లో ఏఎన్‌యూ తరపున వీరు పాల్గొంటారని చెప్పారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ కె.నాసరయ్య, పీడీ ఆదిబాబు వారిని అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ..

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : గుంటూరులో 20న నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్- 18 జూనియర్ ఖోఖో ఛాంపియన్ షిప్ ఎంపిక పోటీల్లో శంకర భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ముగ్గురు, ఒక విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని పార్వతి తెలిపారు. బి.సౌజన్య, టి.లక్ష్మీప్రసూన చంద్రిక, డి.రంగమహాలక్ష్మి, టి.మణిదీప్ ఎంపికై.. 25, 26, 27 తేదీల్లో చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయిని ఝాన్సీరాణి, ఎస్‌కే ఫాతిమా, తిరుపతిరావు, రాధాకృష్ణ తదితరులు అభినందించారు.

పెన్సింగ్ పోటీలకు ముప్పాళ్ల విద్యార్థిని

ఈపూరు, న్యూస్‌టుడే : మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థిని గమిడి సచిత ఆలిండియా అంతర్ విశ్వ విద్యాలయాల పెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ చుండు వెంకటరావు బుధవారం తెలిపారు. కళాశాలలో బీపీఈడీ చదువుతున్న సచిత 21న నాగార్జున విశ్వ విద్యాలయంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట పట్టణం : స్థానిక శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు బేస్‌బాల్ క్రీడలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. మేడికొండూరు మండలం మందడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బేస్‌బాల్ పోటీలు నిర్వహించారు. వీటిలో సత్తా చాటిన పేరుబోయిన లోకేష్ (8వ తరగతి), వాడల భవాని మల్లేష్ (10వ తరగతి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయిని రత్నజ్యోతి, విద్యాకమిటీ ఛైర్మన్ మాణిక్యారావు, పాఠశాల పీడీ పాదిలి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

నాదెండ్ల, న్యూస్‌టుడే : చెన్నై- కోల్‌కత్తా 16వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన గుంటూరు నుంచి బుధవారం నాదెండ్ల పోలీసు స్టేషన్‌కు బుధవారం వస్తున్నారు. కోండ్రుపాడు కేఎంసీ వైద్య కళాశాల వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

సత్తెనపల్లి
• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

బైపాస్‌రోడ్డుపై మొసలి సంచారం

పిడుగురాళ్ల: పట్టణంలోని బైపాస్‌రోడ్డుపై మంగళవారం అర్ధరాత్రి మొసలి సంచరించడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. రిక్షాకాలనీకి కొద్దిదూరంలో బైపాస్‌రోడ్డు పక్కన మొసలి వచ్చింది. దీంతో వాహనదారులు కొద్దిసేపు వాహనాలు నిలిపారు. హారన్ మోగించడంతో రోడ్డు పక్కకు వచ్చి కల్వర్టులోకి వెళ్లింది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో మొసలిని పట్టుకోవటానికి బుధవారం బోను ఏర్పాటు చేశారు.

భూమి తగ్గిందని ఫిర్యాదులు

ముప్పాళ్ల: రీసర్వేలో భూ విస్తీర్ణం తగ్గిందని.. తప్పులతడకగా సర్వే జరిగిందని ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోయారు. లంకెలకూరపాడులో బుధవారం నిర్వహించిన గ్రామసభలో రీసర్వేపై 61 మంది రైతులు ఫిర్యాదు చేశారు. భూమి తగ్గిందని, పీఎల్ఎంతో ఇబ్బంది పడుతున్నామని అన్నదాతల నుంచి ఫిర్యాదులు అందాయి. ఇన్‌ఛార్జి తహసీల్దార్ లక్ష్మీప్రసాద్ రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

పోలీసుల విధులపై అవగాహన


ఎఫ్ఐఆర్ నమోదు, పోలీసు రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సంధ్యారాణి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పోలీసులే ప్రజలకు నిజమైన మిత్రులని పట్టణ ఎస్సై సంధ్యారాణి అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, ప్రజల భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సినిమా థియేటర్లో పోలీసు సినిమాను విద్యార్థులకు ఉచితంగా ప్రదర్శించారు. అమరవీరులకు నివాళులర్పించారు. ఎస్సై పవన్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

అచ్చంపేట: మాదిపాడు ఆర్అండ్‌బీ రహదారిలో సినిమాహాలు, రైస్‌మిల్లు సమీపంలో ఏర్పడిన గుంతలను బుధవారం ఎమ్మెల్యే ప్రవీణ్ చొరవతో సిబ్బంది పూడ్చించారు. ఆర్అండ్‌బీ వర్క్‌ఇన్‌స్పెక్టర్, మండల తెదేపా నేతలు కోటయ్య, ఆంజనేయులు పర్యవేక్షించారు. డయల్ యువర్ ఎమ్మెల్యేకు కొంత మంది ఫోన్ల ద్వారా సమస్య వివరించడంతో చర్యలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 73176

? పట్టణంలోని రెండు, మూడువార్డుల్లో కుక్కల సమస్య అధికంగా ఉంది - వీరాంజనేయులు, స్థానికుడు, సత్తెనపల్లి
✔ కుక్కల దాడిపై ఫిర్యాదులు అందుతున్నాయి. సమస్య నివారణకు చర్యలు తీసుకుంటాం. - షమ్మి, మున్సిపల్ కమిషనర్.

రెజ్లింగ్ పోటీలు రేపు

అచ్చంపేట, న్యూస్‌టుడే: జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి రెజ్లింగ్(కుస్తీ) పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.భూషణం ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు నవంబరు 9, 10 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు.

రాగి తీగ చోరీపై విచారణ

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: రాగి తీగ చోరీపై రైల్వేశాఖ సిబ్బంది బుధవారం విచారణ చేపట్టారు. టవర్ కార్ షెడ్డులో రైల్వే పనుల నిమిత్తం నిల్వ చేసిన రాగి తీగలో సుమారు 30 కిలోలకుపైగా తీగను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. నిల్వ గది ప్రహరీ ఎత్తు తక్కువగా ఉన్న నేపథ్యంలో చోరీ జరిగిందని అనుమానిస్తున్నారు. గుంటూరు ఆర్పీఎఫ్ ఎస్సై శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి సిబ్బందిని విచారించారు.

ప్రమాదకర పయనం

దాచేపల్లి న్యూస్‌టుడే: దాచేపల్లి నుంచి పొందుగల వైపు వెళ్లే జాతీయ రహదారిపై వెళుతున్న ఆటోల్లో విద్యార్థులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నారు. వాహనదారులు నిబంధనలు పాటించాల్సి ఉన్నా సామర్థ్యానికి మించి ప్రయాణికులకు తరలిస్తున్నారు.

వసతులు లేవు.. అవస్థలు తొలగవు..

జగనన్న కాలనీల్లో పరిస్థితి ఇదీ

న్యూస్‌టుడే, అమరావతి


ధరణికోట లేఅవుట్‌లో నీటిట్యాంకు చుట్టూ జమ్ము


అమరావతి లేఅవుట్‌లో అడవిని తలపించేలా..

ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో అంతర్గత రోడ్లు లేవు. వర్షం కురిస్తే బురదలో నడిచే పరిస్థితి లేదు. ఇళ్లచుట్టూ ఉన్న ఖాళీ స్థలాలు పిచ్చిమొక్కలతో పొదల్లా మారాయి. రాత్రయితే వీధి దీపాలు వెలగక అంధకారం అలుముకుంటోంది. ఇళ్ల ముందే మురుగు నిల్వ ఉంటోంది. తాగునీటికి, ఇతర అవసరాలకు కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇళ్లు పూర్తయి నివాసం ఉంటున్న వారు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 8077 గృహాలు మంజూరుకాగా 585 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి వీటిలో ప్రస్తుతం కొందరు ఉంటున్నారు. మరికొందరు నివాసానికి ఆమోదయోగ్యంగా లేకపోవడంతో ఇళ్లు పూర్తయినా ఉండడం లేదు. అధికారులు స్పందించి కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

రాత్రయితే అంధకారం



కాలనీలో నివాసం ఉంటున్నాం. రాత్రయితే విషపురుగులతో భయం వేస్తోంది. మొదట్లో ఒక నెల మాత్రం వీధి దీపాలు వెలిగించారు. తర్వాత నుంచి వెలగడం లేదు. రాత్రివేళ పాములు సంచరిస్తున్నాయి. ఎన్నిసార్లు పంచాయతీ అధికారులను అడిగినా వీధి దీపాలు మాత్రం వెలిగించడం లేదు. **-ముప్పా పద్మ**

తాగునీటికి అవస్థలు



రెండేళ్ల నుంచి కాలనీలో నివాసం ఉంటున్నాం. తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. కాలనీలో వేసిన బోర్ల నుంచి వచ్చే నీరు ఉప్పగా ఉండడంతో తాగడానికి పనికి రావడం లేదు. దీంతో మూడు కిలోమీటర్లు వెళ్లి నీటిని కొని తెచ్చుకోవాల్సి వస్తోంది. గతంలో కృష్ణానది నీటిని తాగేవాళ్లం. ఇక్కడ అందుబాటులో లేక నీటిని సైతం కొనాల్సి వస్తోంది. **-నాగరాజు, ధరణికోట**

ఇంటిముందే మురుగు



కాలనీలో రహదారులు, మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగు నిలుస్తోంది. మా ఇంటి ముందు ఖాళీ స్థలంలో జమ్ము పెరిగింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. తాగునీటి వసతి లేదు. పరిసరాలు శుభ్రంగా ఉండడం లేదు. తరచూ రోగాల బారిన పడుతున్నాం. **- సత్యనారాయణ రాజు**

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు కావాలి


బీఎల్‌వోలకు సూచనలు చేస్తున్న కమిషనర్ షమ్మి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేసే బాధ్యతను బీఎల్‌వోలు తీసుకోవాలని పురపాలక సంఘ కమిషనర్ కె.షమ్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ విద్యార్హత కలిగిన వారు పట్టభద్ర ఓటర్లుగా నమోదయ్యేలా బీఎల్‌వోలు అవగాహన కల్పించాలన్నారు. ఫారం-18లను పట్టభద్రులకు అందజేసి వారితో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేయించాలని కమిషనర్ సూచించారు.

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు పట్టభద్రులందరూ వెంటనే ఓటర్లుగా నమోదవ్వాలని తెదేపా నేత మన్నెం శివనాగమల్లేశ్వరరావు అన్నారు. పట్టణంలోని తాలుకా సెంటర్‌లో బుధవారం తెదేపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఫారం-18లు పూరించడం, పట్టభద్ర ఓటర్లుగా నమోదవడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పార్టీ నాయకులు శ్రీనివాసరావు, చలపతిరావు, జయరామ్, వెంకటకోటయ్య, శ్రీను, జానిబాబు, వీరభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సృజనకు పదును

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పిడుగురాళ్లలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతి పి.అమృతవర్షిణి (తొమ్మిదో తరగతి), ద్వితీయ బహుమతి జి.శివకృష్ణ (పదో తరగతి), తృతీయ బహుమతి ఎం.లీలశృతి (తొమ్మిదో తరగతి) సాధించారు. ప్రిన్సిపల్ పి.నరేష్ చేతులు మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల డైరెక్టరు బి.గిరిబాబు అభినందించారు.


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ నరేష్

పాచిపట్టిన తాగునీటి ట్యాంకు


యాదవ బజారులో ట్యాంకు ఇలా..

దుర్గి: ఓబులేశునపల్లె యాదవ వీధిలో తాగునీటి ట్యాంకు లీకులతో వెలుపల పాచి పట్టింది. ట్యాంకుకు పైన మూత కూడా లేకపోవడంతో నీరు కలుషితమవుతోంది. కొంత కాలంగా బుగ్గవాగు నీరు రాకపోవడంతో ఇక్కడి ప్రజలు ఈ నీటినే తాగుతున్నారు. అపరిశుభ్రంగా ఉన్న ట్యాంకు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

జడ్జికి విద్యార్థినులు సమస్యల ఏకరువు


చరవాణి వెలుగులో ఆహార పదార్థాల రుచి చూస్తున్న సివిల్ జడ్జి

సత్తెనపల్లి: నాణ్యతలేని ఆహారం తినలేకపోతున్నాం.. దోమల నుంచి రక్షణ లేకపోవడంతో వసతిగృహంలో ఉండలేకపోతున్నామని పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని బీసీ కళాశాల వసతిగృహ విద్యార్థినులు స్థానిక సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్), మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు ఎదుట సమస్యలు ఏకరువు పెట్టారు. కళాశాల విద్యార్థినుల వసతిగృహాన్ని బుధవారం రాత్రి జడ్జి సందర్శించారు. వసతిగృహానికి జడ్జి వెళ్లిన సమయంలో విద్యుత్తు సరఫరా లేదు. చరవాణి వెలుగులోనే విద్యార్థినుల కోసం వండిన ఆహార పదార్థాలు రుచి చూశారు. విద్యార్థినుల సమస్యలు ఆలకించారు.

ఆగని మట్టి తవ్వకాలు

గురజాల గ్రామీణ: మాడుగుల స్తంభాలబోడులో కొందరు అక్రమంగా మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులు అక్కడకు చేరుకుని జేసీబీ, మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితులను విచారిస్తున్నట్లు తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి


నార్నెపాడులో విచారణ చేస్తున్న ఆర్డీవో

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో దాఖలైన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్నెపాడు గ్రామానికి చెందిన రైతు యర్రం కృష్ణారెడ్డి పీజీఆర్ఎస్‌లో దాఖలు చేసిన భూమి బోడెకాల్వ సంబంధ అర్జీని బుధవారం ఆయన విచారించారు. కృష్ణారెడ్డి పొలాన్ని సందర్శించి ఆయన సమస్యను పరిశీలించారు. భూరికార్డులను పొలాల్లోనే పరిశీలించి సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ లక్ష్మీప్రసాద్, సర్వేయర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చేపట్టాలి


మిరపలో సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న ఏవో కృష్ణయ్య

బెల్లంకొండ, న్యూస్‌టుడే: పత్తి, కంది, మిరప పంటల్లో ఆకుచుట్టు పురుగు ఆశించకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం వెంకటాయపాలెం, మాచాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముదురు కందిలో మారుక ఆకు చుట్టు పురుగు ఆశించకుండా ముందు జాగ్రత్తగా వేప నూనె పిచికారీ చేసుకోవాలని సూచించారు. పత్తిలో ఆకుమచ్చ, మిరపలో పొగాకు లద్దె పురుగు నివారణ చర్యలను రైతులకు వివరించారు.

ఆకుచుట్టు పురుగు ఉద్ధృతి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: వరిపైరులో ఆకుచుట్టు పురుగు ఉద్ధృతి అధికంగా ఉందని పిడుగురాళ్ల సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. బుధవారం మండలంలోని కరాలపాడు, చెన్నాయిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వ్యవసాయ అధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి, పి.వెంకటగోపి, రేష్మా తదితరులున్నారు.

మాచవరం: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం తురకపాలెంలో నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రామమ్మ రైతులతో కలిసి పంట పొలాలు పరిశీలించారు. పత్తి, కందిలో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు వివరించారు.

ఎరువులు అధిక ధరకు అమ్మితే చర్యలు


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ జగదీశ్వరరెడ్డి తదితరులు

రెంటచింతల, న్యూస్‌టుడే: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్ల ఏడీఏ జగదీశ్వరరెడ్డి చెప్పారు. బుధవారం స్థానిక ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. మండలంలోని పలు రైతు భరోసా కేంద్రాల్లో 120 టన్నుల యూరియా, 80 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 50 టన్నుల డీఏపీ సిద్ధంగా ఉన్నాయి. ఏవో బ్రహ్మారెడ్డి ఉన్నారు.


జట్టుకు ఎంపికైన విద్యార్థులు

సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపిక

క్రోసూరు (అచ్చంపేట): క్రోసూరు సెయింటాన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ముగ్గురు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని సిస్టర్ మేరి రజిత తెలిపారు. తనూజ, చందన, దీవెన ఏంజిల్‌లు ఎంపికయ్యారన్నారు. వీరు నవంబరు 16, 17, 18 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరగనున్న అంతర్‌జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

పెదకూరపాడు: ఇంటి ఆవరణలో నిలిపిన ద్విచక్ర వాహనం అపహరణకు గురవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెదకూరపాడు సినిమాహాలు కూడలికి చెందిన పఠాన్ మస్తాన్‌కు చెందిన ద్విచక్ర వాహనం గత నెల ఒకటో తేదీ అపహరణకు గురైంది.

వంతెనలు.. ప్రమాద ఘంటికలు


ఓబులేశునపల్లె సమీపంలో ఎర్రవాగుపై..


శిథిలావస్థకు చేరిన కొండవాగు వంతెన

న్యూస్‌టుడే, దుర్గి

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట- మాచర్ల ప్రధాన రహదారిపై అడిగొప్పల సమీపంలోని కొండవాగు, ఓబులేశునపల్లె సమీపంలోని ఎర్రవాగుపై వంతెనలు శిథిలావస్థకు చేరి, ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మూడు దశాబ్దాలకే దెబ్బతిని ఎప్పుడు కూలుతాయో అన్న ఆందోళన నెలకొంది. దుర్గి మండలంలోని పలు వంతెనలు దెబ్బతిని ప్రమాదాలకు నిలయంగా మారాయి.

★★ కొండవాగు వంతెన నలభై ఏళ్ల కిందట నిర్మించారు. ప్రస్తుతం దీని అడుగు భాగాన శ్లాబు పెచ్చులూడి ఇనుప ఊచలు బయటపడ్డాయి. కొంతభాగం శ్లాబ్ కుంగింది. నిర్మాణ సమయంలో 15 టన్నులకు మించి వాహనాలు వెళ్లేవి కావు. ప్రస్తుతం 50 టన్నులకుపైగా బరువుతో వాహనాలు నడుస్తున్నాయి. వంతెన గోడలు దెబ్బతిన్నాయి. ఇక్కడ రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. 2010లో వాహనాలు ఢీకొని వంతెన గోడలు కూలడంతో అప్పటి ఎస్సై వెంకటేశ్వరరెడ్డి దాతల సహకారంతో ఇటుకరాళ్లతో తాత్కాలికంగా గోడ కట్టించారు.

★★ అడిగొప్పల సమీపంలో సాగర్ కుడి కాలువ వంతెన 70 ఏళ్ల కిందట నిర్మించారు. ఎనిమిదేళ్ల కిందట వంతెన గోడను లారీ ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. అప్పట్లో అధికారులు ఇటుకలతో తాత్కాలిక గోడ ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం ఈ వంతెన శిథిలమైంది.

★★ ఓబులేశునపల్లె సమీపంలో ఎర్రవాగుపై వంతెన 50 ఏళ్ల కిందట నిర్మించారు. ఇది కూలేందుకు సిద్ధంగా ఉంది. ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళన ప్రయాణికుల్లో నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

వెంకయ్యనాయుడిని కలిసిన కన్నా..

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడిని గుంటూరు నగరంలో బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో పలు విషయాలపై మాట్లాడారు.

లోకేశ్‌ను కలిసిన శివరామ్

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్య, ఐటీశాఖా మంత్రి నారా లోకేశ్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ కలిశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. లోకేశ్ కృషితో రాష్ట్రంలో ఉద్యోగ విప్లవం రాబోతుందని శివరామ్ చెప్పారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

అచ్చంపేట: జడ్పీ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయిని సి.కల్యాణి, ఉపాధ్యాయినులతో కలిసి భోజనం రుచి చూశారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

ఖాళీపోస్టులు భర్తీ చేయాలని వినతి

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: గురజాల డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్‌మెన్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ కోరారు. ఈ మేరకు గురజాల ఆర్డీవో కార్యాలయ అధికారులకు బుధవారం వినతిపత్రం అందించారు. అనంతరం వీఆర్ఏలతో సమావేశం ఏర్పాటు చేశారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాలు

మాచవరం: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పోలీసులు ప్రదర్శన నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ కూడలి వరకు విద్యార్థులతో కలిసి నినాదాలు చేశారు. మానవహారంలా ఏర్పడ్డారు. ఎస్సై సతీష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



■ భారత నౌకాదళానికి చెందిన ఏ యుద్ధ నౌక 2024, ఆగస్టులో మధ్యధరా సముద్రంలో స్పానిష్ నేవీ షిప్ అటాలయాతో మారిటైమ్ పార్టనర్‌షిప్ ఎక్సర్‌సైజ్ (ఎమ్ పీ ఎక్స్)లో పాల్గొంది. జ: ఐఎన్ఎస్ తాబర్

■ పసిఫిక్ ఆసియా ట్రావెల్ అసోసియేషన్ (పీఏటీఏ) గోల్డ్ అవార్డు – 2024ను భారత్‌కు చెందిన ఏ రాష్ట్రం గెలుచుకుంది? (బ్యాంకాక్‌లో జరిగిన పాటా ట్రావెల్ మార్ట్ – 2024లో ఈ అవార్డును ప్రదానం

మాదిరి ప్రశ్నలు

చేశారు. 'పాటా' అనేది పర్యాటక రంగంలో ప్రసిద్ధి చెందిన సంస్థ.) జ: కేరళ

■ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ఇటీవల ఎవరికి 'యూత్ ఐకాన్స్ ఆఫ్ ఇండియా' పురస్కారాన్ని ప్రదానం చేసింది? జ: బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, జావెలిన్ త్రో క్రీడాకారుడు నీరజ్ చోప్రా.

■ ఆఫ్రికన్ సంతతి ప్రజల కోసం అంతర్జాతీయ దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు? (ఈ దినోత్సవాన్ని మొదటిసారిగా 2021లో నిర్వహించారు. ఆఫ్రికన్ సంతతి ప్రజల కోసం అంతర్జాతీయ దశాబ్దంగా 2015 – 2024ను నిర్వహించారు.) జ: ఆగస్టు 31

■ పర్యాటక రంగంలో సహకారాన్ని బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఇటీవల భారత్‌తో ఏ దేశం ఒప్పందం చేసుకుంది? జ: మలేసియా

మరింత సమాచారం


ప్రిపరేషన్ టెక్నిక్

పాఠాలకు సంబంధించిన క్లిష్టమైన భావనలను అర్థం చేసుకోడానికి, గైడెన్స్ కోసం ఇప్పుడు యాప్‌లు, యూట్యూబ్ లేదా ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల్లో ఉన్న వీడియోలు, మెటీరియల్‌ను ఉపయోగించుకోవచ్చు.

డీఎస్సీ -2024
హిందీ కంటెంట్

రసాయన విలువ మారితే రంగుల్లో తేడాలు!

పదార్థ లక్షణాలు, రుచుల ఆధారంగా ద్రావణాలను ఆమ్లాలు, క్షారాలుగా విభజిస్తారు. సాధారణంగా ఒక పదార్థం ఆమ్లమా లేదా క్షారమా అని నిర్ణయించడానికి సహజ, రసాయన, ఘ్రాణ సూచికలు అవసరమవుతాయి. కానీ ఒక పదార్థం బలమైన, బలహీనమైన ఆమ్లం లేదా క్షారం అని తెలుసుకోవడానికి ఆ సూచికలు ఉపయోగపడవు. ఆమ్ల, క్షారాల మధ్య తేడాను గుర్తించడానికి కావాల్సిన సూచికలు ఏమిటి, వాటిని ఎలా వాడాలి అనే కనీస రసాయన శాస్త్ర పరిజ్ఞానం పోటీ పరీక్షార్థులకు ఉండాలి. వివిధ ద్రావణాలు, నేల, నీరు, మానవ దేహంలోని ఆమ్ల, క్షారాలు; వాటి విలువలు, అవి సమతాస్థితిని కోల్పోతే వచ్చే సమస్యలు, సరిచేయడానికి కావాల్సిన సహజ పదార్థాలు, రసాయన ఔషధాల గురించి నిజజీవిత అనువర్తనాలతో సహా తెలుసుకోవాలి.





మట్టి రసాయన విశ్లేషణలో pH విలువ పరీక్ష

జనరల్ స్టడీస్
రసాయన శాస్త్రం

ఆమ్లాలు - క్షారాలు

ఒక పదార్థం బలమైన/బలహీనమైన ఆమ్లమా, క్షారమా అని నిర్ణయించడానికి సార్వత్రిక ఆమ్ల క్షార సూచిక (యూనివర్సల్ యాసిడ్ బేస్ ఇండికేటర్) ఉపయోగిస్తారు.

సార్వత్రిక ఆమ్ల క్షార సూచిక: ఇది అనేక సూచికల మిశ్రమం. ఇది ద్రావణంలో ఉన్న హైడ్రోజన్ అయాన్ల గాఢత ఆధారంగా బలమైన, బలహీనమైన ఆమ్ల, క్షారాలను గుర్తిస్తుంది. ఈ సూచిక ద్రావణంలోని హైడ్రోజన్ అయాన్ల గాఢత ఆధారంగా వేర్వేరు రంగులను ప్రదర్శిస్తుంది. ఒక ద్రావణంలోని హైడ్రోజన్ అయాన్ల గాఢతను కొలవడానికి pH స్కేల్‌ను 'సోరెన్‌సన్' అభివృద్ధి చేశారు. జర్మన్ భాషలో pHలో p ని పొటెన్జ్/సామర్థ్యం అని అంటారు.

◆ pH స్కేల్‌లో pH అనేది ద్రావణ ఆమ్ల లేదా క్షార స్వభావాన్ని సూచించే ఒక సంఖ్యగా భావించాలి. pH విలువలతో సాధారణంగా 0 నుంచి 14 వరకు వాటి ఆమ్ల, క్షార స్వభావాలను కొలవవచ్చు. హైడ్రోనియం అయాన్ గాఢత ఎక్కువగా ఉంటే pH విలువ తక్కువగా ఉంటుంది.



pH స్కేలు

◆ pH స్కేలుపై 7 కంటే తక్కువ విలువలు ($pH < 7$) ఆమ్ల ద్రావణాన్ని సూచిస్తాయి.

◆ pH స్కేలుపై 7 కంటే ఎక్కువ విలువలు ($pH > 7$) క్షార ద్రావణాన్ని సూచిస్తాయి.

◆ తటస్థ ద్రావణాల pH విలువ 7. సాధారణ pH ను కొలవడానికి సార్వత్రిక సూచికలో నానబెట్టిన కాగితాన్ని ఉపయోగిస్తారు.

వరుసగా ఉత్పత్తి చేసిన H^+, OH^- అయాన్ల సంఖ్యపై ఆమ్లాలు, క్షారాల బలం ఆధారపడి ఉంటుంది. ఒక మోలార్ గాఢత ఉన్న హైడ్రోక్లోరిక్ ఆమ్లం, ఎసిటిక్ ఆమ్లం తీసుకుంటే, అప్పుడు అవి వేర్వేరు మొత్తాల్లో హైడ్రోజన్ అయాన్లను ఉత్పత్తి చేస్తాయి. ఎక్కువ H^+ అయాన్లను ఇచ్చే ఆమ్లాలను 'బలమైన ఆమ్లాలు'గా, తక్కువ H^+ అయాన్లను ఇచ్చే ఆమ్లాలను 'బలహీన ఆమ్లాలు' పేర్కొంటారు.

నిత్యజీవితంలో pH ప్రాముఖ్యం: శరీరంలోని రసాయనాల pH విలువలు 7.0 - 7.8 పరిధిలో ఉంటాయి. జీవరాశులన్నీ pH విలువలోని అతిస్వల్ప మార్పులకు గురై మాత్రమే జీవించగలుగుతాయి. వర్షపు నీటి pH విలువ 5.6 కంటే తక్కువైతే దాన్ని 'ఆమ్ల వర్షం' అంటారు. ఆమ్ల వర్షపు నీరు నదీ జలాల్లో కలిసినప్పుడు ఇది నదీ జలాల pH విలువను కూడా తగ్గించడం వల్ల నదుల్లోని జలచరాల జీవనం ప్రమాదంలో పడుతుంది.

❖ సల్ఫ్యూరిక్ ఆమ్లానికి చెందిన మందపాటి తెలుపు, పసుపురంగు మేఘాలతో శుక్ర గ్రహ వాతావరణం ఉంటుంది.

పెరటిలోని మట్టి pH విలువ: మొక్కల ఆరోగ్యకరమైన పెరుగుదలకు నిర్దిష్ట పరిధిలో pH ఉన్న మట్టి చాలా అవసరం. నేల స్వభావం అధిక ఆమ్ల స్వభావం లేదా అధిక క్షార స్వభావంతో ఉండకూడదు. తటస్థ స్వభావం ఉన్న నేల పంటలకు అనుకూలంగా ఉంటుంది. నేల స్వభావం ఆమ్లత్వానికి గురైతే దాన్ని తటస్థీకరించడానికి క్షార స్వభావం ఉండే పొడిసున్నం లేదా తడిసున్నం లేదా క్యాల్షియం కార్బొనేట్‌ను ఉపయోగించాలి. అలాగే నేల స్వభావం క్షారత్వానికి గురైతే దాన్ని తటస్థీకరించడానికి సేంద్రియ ఎరువులు (కంపోస్టు) వాడాలి.

❖ హైడ్రాంజియా అనే మొక్క పెరిగే నేల pH విలువ ఆధారంగా రంగు రంగుల పుష్పాలను ఇస్తుంది. ఈ మొక్క పెరిగే నేల pH విలువ 6.5 కంటే ఎక్కువ ఉంటే గులాబీ (పింక్) రంగు పుష్పాలు, 5.5 కంటే తక్కువ ఉంటే నీలం రంగు పుష్పాలు ఇస్తుంది.

జీర్ణవ్యవస్థ pH: మనిషి జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతుంది. ఇది జీర్ణాశయానికి నష్టం కలిగించకుండా ఆహారాన్ని జీర్ణం చేయడంలో ఉపయోగపడుతుంది. అజీర్తి సమయంలో జీర్ణాశయం అధిక పరిమాణంలో ఆమ్లాన్ని ఉత్పత్తి చేయడం వల్ల కడుపులో మంట, అసహనం కలుగుతాయి. ఈ బాధ నుంచి విముక్తి పొందడానికి యాంటాసిడ్‌గా పిలిచే బలహీన క్షారాలను ఉపయోగిస్తారు. యాంటాసిడ్‌లు అధికమైన ఆమ్లాన్ని తటస్థీకరిస్తాయి. ఇందు కోసం సాధారణంగా మెగ్నీషియం హైడ్రాక్సైడ్/ మిల్క్ ఆఫ్ మెగ్నీషియాగా పిలిచే బలహీన క్షారాన్ని ఉపయోగిస్తారు.

దంత క్షయానికి pH మార్పు: లాలాజలం pH విలువ 5.5 కంటే తగ్గితే దంత క్షయం ప్రారంభమవుతుంది. దీనివల్ల శరీరంలోనే అత్యంత దృఢమైన ఎనామిల్ పొర క్షయానికి గురవుతుంది. ఈ సందర్భంలో చల్లని/వెచ్చని పదార్థాలు దంతాలకు తాకినప్పుడు జివ్వుమనే బాధ కలుగుతుంది. ఈ బాధ నుంచి ఉపశమనం పొందడానికి బలహీన క్షారస్వభావం ఉండే టూత్‌పేస్ట్‌ను ఉపయోగించాలి.

రసాయన యుద్ధం ద్వారా జంతువులు, మొక్కల స్వీయ రక్షణ: తేనెటీగ కుట్టినప్పుడు మానవ శరీరంలోకి మిథనోయిక్ ఆమ్లం విడుదలవుతుంది. దీనివల్ల కలిగే నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి బేకింగ్ సోడాను ఉపయోగిస్తారు. అలాగే చీమ కుట్టినప్పుడు మానవ శరీరంలోకి ఫార్మిక్ ఆమ్లం విడుదలవుతుంది. దీనివల్ల ఏర్పడే నొప్పి నుంచి ఉపశమనానికి బేకింగ్ సోడా/కాలమైన్ వాడతారు. దూలగొండి మొక్క శరీరాన్ని తాకితే అది శరీరంలోనికి మిథనోయిక్ ఆమ్లం విడుదల చేస్తుంది. దీనివల్ల కలిగే దురద, మంటను నివారించడానికి బలహీన క్షారస్వభావం ఉన్న దుష్టిపాకు ఉపయోగించాలి. కందిరీగ కుట్టినప్పుడు మన శరీరంలోకి క్షారం విడుదలవుతుంది. దీని నుంచి ఉపశమనానికి బలహీన ఆమ్ల స్వభావం ఉండే నిమ్మరసాన్ని వినియోగించాలి.

ముఖ్యమైన పదార్థాలు, వాటి pH విలువలు: ✦ స్వేదజలం - 7 ✦ సముద్రపు నీరు - 8 ✦ వంటసోడా - 8.2 ✦ అమ్మోనియం - 11.2 ✦ మిల్క్ ఆఫ్ మెగ్నీషియా -10.6 ✦ పాలు - 6.6 ✦ రక్తం - 7.4 ✦ కాఫీ - 4.8 ✦ వెనిగర్ - 3 ✦ సోడానీరు - 2.4 ✦ నిమ్మరసం - 2.2 ✦ H_2SO_4 - 0.2 ✦ గ్యాస్ట్రిక్ రసం - 1.2 ✦ NaOH ద్రావణం - 14.



రచయిత: చంటి రాజుపాలెం



జీవుల నుంచే జీవుల ఆవిర్భావం

ప్రశ్నలు జవాబులు

2 మార్కులు

జీవ ప్రపంచ వైవిధ్యం

1) బయోజెనిసిస్ అంటే ఏమిటి?
జ: 'జీవం లేదా జీవులు అంతకు ముందున్న జీవం లేదా జీవుల నుంచి మాత్రమే ఉద్భవిస్తాయి, నిర్జీవుల నుంచి కాదు.' అని తెలిపే జీవ పరిణామ సిద్ధాంతమే 'బయోజెనిసిస్'.

2) కణజాల శాస్త్రాన్ని నిర్వచించండి. దీనికి ఉన్న మరో పేరు ఏమిటి?
జ: జీవిలోని వివిధ కణజాలాలకు సంబంధించిన సూక్ష్మ అధ్యయనాన్ని కణజాల శాస్త్రం అంటారు. దీన్ని 'సూక్ష్మ అంతర్నిర్మాణ శాస్త్రం' అని కూడా అంటారు.

3) త్రినామ నామీకరణ అంటే ఏమిటి? ఉదాహరణ ఇవ్వండి.
జ: ఒక జీవికి మూడు పదాలున్న శాస్త్రీయ నామాన్ని ప్రతిపాదించే విధానాన్ని 'త్రినామ నామీకరణ' అంటారు.
ఉదా: హోమో సెపియన్స్ సెపియన్స్
ఒక త్రినామంలో మొదటి పదం ప్రజాతిని, రెండో పదం జాతిని, మూడో పదం ఉపజాతిని సూచిస్తాయి.

4) టాటోనిమీ అంటే ఏమిటి? రెండు ఉదాహరణలు ఇవ్వండి.
జ: ఒక జీవికి ప్రతిపాదించిన ద్వినామంలో ప్రజాతి నామం, జాతి నామం ఒకే విధంగా ఉండేలా నామీకరణం జరిగే విధానాన్ని టాటోనిమీ అంటారు. ఉదా: నాజా నాజా - నాగుపాము, ఏక్సిస్ ఏక్సిస్ - మచ్చల జింక

5) ICZN ను విపులీకరించండి.
జ: ICZN అంటే 'అంతర్జాతీయ జంతు నామీకరణ నియమావళి'.
విపులీకరణ: 'ఇంటర్నేషనల్ కోడ్ ఆఫ్ జువాలాజికల్ నామెన్‌క్లేచర్'.

6) జాతి సమృద్ధతను నిర్వచించండి.
జ: ఒక నిర్దిష్ట వైశాల్యం ఉన్న భూభాగంలో నివసించే జాతుల సంఖ్యను జాతి సమృద్ధత అంటారు.
$\log S = Z \log A + \log C$
S = జాతి సమృద్ధత
A = వైశాల్యం
C = Y అంతర ఖండం
Z = రేఖ వాలు

ముఖ్యమైనవి మరికొన్ని..

(2 మార్కులు)

1) ప్రోటోస్టోమియా, డ్యుటిరోస్టోమియాలను విభేదీకరించండి.
2) ప్రకృతి నుంచి లభించే ఏవైనా రెండు ఔషధాలను పేర్కొనండి.
3) భారతదేశంలోని ఏవైనా నాలుగు పావన వనాలను పేర్కొనండి.
4) IUCN ను విపులీకరించండి. అంతరించిపోతున్న జాతుల పట్టికను ఏ పుస్తకంలో ఇస్తారు?

జవాబుల కోసం

– కె. రవిచరణ్

శారదాపీఠం భూముల్లో అక్రమాలు అన్నీ ఇన్నీ కావు

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు డిజిటల్, అమరావతి: శారదాపీఠం భూముల్లో సాగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎకరం రూ.20 కోట్ల ధర పలికే భూమిని కేవలం రూ.లక్ష చొప్పున 15 ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారని వివరించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. 'సాంస్కృతిక కళాశాల ఏర్పాటు పేరుతో భూములను తీసుకుని వాటిని శారదా పీఠానికి మళ్లించుకునేందుకు అక్రమాలు చేశారు. వాటిని గుర్తించాం కాబట్టే లీజును రద్దు చేశాం. ఎర్రమట్టి దిబ్బలను సైతం గత పాలకులు కొల్లగొట్టారు. అక్రమాలన్నింటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

పట్టాలపై గంజాయి సేవనం..

రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి



కిరణ్‌కుమార్ యాసిన్

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టాలపై కూర్చుని గంజాయి తీసుకుంటుండగా.. రైలు దూసుకురావడంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. కదిరి రైల్వే పోలీసుల కథనం మేరకు... అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కిరణ్‌కుమార్ (18), అదే పట్టణానికి చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి యాసిన్ (17) మంగళవారం రాత్రి చిత్తూరు మార్గంలోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి గంజాయి తీసుకోవడం మొదలుపెట్టారు. అదే సమయంలో నాగర్‌కోయిల్ నుంచి ముంబయి వెళ్లే రైలు వీరిపై నుంచి దూసుకెళ్లింది. గంజాయి మత్తులో రైలు వస్తున్న విషయాన్ని వారు గమనించకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. లోకో పైలట్ అందించిన సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లి చూడగా యాసిన్ చనిపోయి కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న కిరణ్‌కుమార్‌ను తిరుపతి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూశాడు. ఇద్దరూ గంజాయికి అలవాటు పడ్డారని, వారి వద్ద గంజాయి పొట్లాలు దొరికాయని రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యాసాగర్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో విజయవాడ కోర్టు ఈ ఏడాది సెప్టెంబర్ 23న తనకు రిమాండ్ విధించడాన్ని సవాల్ చేస్తూ వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ప్రకటించారు. సాధ్యమైనంత త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు.



ఇతరులు బాధపడతారని క్షమాపణ చెప్పొద్దు

మీరు తప్పు చేసినప్పుడే క్షమాపణ చెప్పండి. మీ కోసం తీసుకొనే నిర్ణయాలతో ఎదుటివారు బాధపడతారన్న ఆలోచనతో మాత్రం క్షమాపణ చెప్పకండి. అది వారి సమస్యే తప్ప మీది కాదు. మీరేదైనా కొత్తగా ప్రయత్నించి విఫలమైనప్పుడు, మీరేం కోరుకుంటున్నారో చెప్పినప్పుడు, మీ అభిప్రాయాన్ని వెల్లడించినప్పుడు, కుటుంబంతో గడపడానికి పనికి దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు మీరు తప్పు చేసినట్లు కాదు. ఆ సందర్భాల్లో ఎవ్వరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు.

– డేనియల్ ఆరోస్, రచయిత

స్వామి అడుగులకు మడుగులు!

- భూముల కేటాయింపులో ఉల్లంఘనలు
- ట్రస్టీ పేరుతో అభ్యర్థన.. ఉత్తరాధికారి పేరుతో కేటాయింపులు
- నాటి వైకాపా పాలనలో సర్వం మాయ

ఈనాడు–అమరావతి, విశాఖపట్నం: వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదా పీఠానికి నాటి వైకాపా ప్రభుత్వం అడుగడుగునా వత్తాసు పలికింది. రూ.225 కోట్ల విలువచేసే 15 ఎకరాలను.. నిబంధనలు ఉల్లంఘించి రూ.15 లక్షలకు కట్టబెట్టారు. ఒకసారి ఉత్తరాధికారి, మరోసారి ట్రస్టీ పేరుతో వ్యవహారాలు నడిపి గందరగోళానికి తెరతీశారు. అభ్యర్థన ఒకరి పేరుతో రాగా.. కేటాయింపు మరొకరి పేరున జరిగింది. గత జులై 15న ముఖ్యమంత్రి చంద్రబాబు 'సహజ వనరుల దోపిడీ' పేరుతో విడుదల చేసిన శ్వేతపత్రంలో శారదా పీఠానికి కేటాయించిన భూముల వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. తదుపరి చర్యల్లో భాగంగా కలెక్టర్ నుంచి అందిన నివేదికపై మంత్రివర్గంలో చర్చించి ఎన్డీయే ప్రభుత్వం రద్దుచేసింది. భూముల కేటాయింపులో విశాఖ జిల్లా అధికార యంత్రాంగం గుర్తించిన ప్రధాన ఉల్లంఘనలు ఇవీ..

★ నిబంధనల ప్రకారం ట్రస్టు నిర్వాహకులు, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేరున కాకుండా పీఠం ఉత్తరాధికారి పేరున ఆ భూములను బదలాయించకూడదు.

★ తొలుత 2.9.2021న పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి 15 ఎకరాలు కావాలని అభ్యర్థించారు. శాశ్వత బదలాయింపు కోసం ఉత్తరాధికారి ఫారం-29లో వివరాలు పూర్తిచేసి సమర్పించాల్సి ఉన్నా.. అవేమీ చేయలేదు.

★ అప్పటి ప్రభుత్వం స్వాత్మానందేంద్ర అభ్యర్థన మేరకు 24.10.2021లో భూములు బదలాయింపు జీఓ 571 ఇచ్చేసింది. ఆ తర్వాత పీఠం ట్రస్టీ చాగంటి ప్రకాశరావు ఫారం-29లో వివరాలు నింపి దరఖాస్తు చేశారు.


★ 29.11.2021న శారదా పీఠం ట్రస్టీ పేరున భూమిని బదలాయిస్తూ జీఓ 343ను ఇచ్చింది. వాస్తవానికి ఫారం-29 ఎవరు సమర్పిస్తారో వారి పేరున బదలాయించాలి. ఇక్కడ ట్రస్టీ చేయడంతో ఆయన పేరున జీఓ ఇచ్చారు. మొదట ఉత్తరాధికారి పేరున ఒక జీఓ ఇచ్చి, ట్రస్టీ పేరున మరొకటి విడుదల చేశారు.

★ తర్వాత భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా, సర్వే నంబర్లు మార్చి ఇవ్వాలని శారదా పీఠం ట్రస్టీ అప్పటి రెవెన్యూ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

★ వెంటనే రెండు సర్వే నంబర్లలో ఉన్న భూములను ఒకే సర్వే నంబరు కింద మార్చి సవరించిన ఉత్తర్వులను ట్రస్టీ పేరున ఇచ్చారు. శాశ్వత బదలాయింపు ఉత్తర్వుల్లో స్వాత్మానందేంద్ర సరస్వతి పేరున ఇచ్చిన దాంట్లోనూ మార్చారు. 8.2.2022న నాటి ప్రభుత్వం 343 బదలాయింపు ఉత్తర్వులను సవరించి కొత్తగా శారదా పీఠం ఉత్తరాధికారి పేరున జీఓ 64ను కొత్తగా ఇచ్చింది. ఇలా ఒక్కోసారి ఒక్కొక్కరి పేరున నచ్చినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

★ 20.11.2023న ఆధ్యాత్మిక, ట్రస్టు అవసరాల కోసం ఈ భూమిని ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రయత్నించారు. అందు కోసం అప్పటి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పీఠం ఉత్తరాధికారి లేఖ రాశారు. వడ్డించే వాడు మనవాడైతే అన్నీ వస్తాయన్నట్లుగా ఒక రాయి వేశారు.

★ ఆ ప్రతిపాదించిన స్థలంలో ఘాట్ రోడ్డు నిర్మించేశారు. ప్రస్తుతం ఒక బోరు, షెడ్డు ఉంది.



డ్రైవింగ్ లైసెన్స్‌లో అవయవదానం వివరాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్స్‌లో డ్రైవర్ వివరాలతో పాటు సామాజిక అంశాలకు కొత్తగా ప్రాధాన్యం ఇచ్చారు. డ్రైవర్ పేరు, చిరునామా, పుట్టిన తేదీ, అర్హత పొందిన వాహనం స్వభావం వివరాలతో పాటు అవయవదానం చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అనే విషయాన్ని ఇటీవల ముద్రించారు. వీటితో పాటు డ్రైవర్ రక్త గ్రూపు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్, అర్హత పొందిన వాహనాల చిత్రాలనూ ముద్రించారు. దీనివల్ల ప్రమాదం జరిగిన సమయంలో సమాచారం ఇవ్వడానికి ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

రాజ్యలక్ష్మి దాతృత్వం ఆదర్శప్రాయం

- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్యాంకులో దాచుకున్న రూ.61 లక్షల నగదును తన మరణానంతరం సామాజిక, స్వచ్ఛంద సేవా సంస్థలకు దానం చేసిన జీఎస్టీ విశ్రాంత సూపరింటెండెంట్ శిష్ట్లా రాజ్యలక్ష్మి దాతృత్వం అందరికీ ఆదర్శప్రాయమని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గుంటూరు కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో నరసింహారెడ్డి చేతుల మీదుగా వివిధ సేవా సంస్థలకు బుధవారం చెక్కులు అందజేశారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యలక్ష్మి ఆదర్శ నిర్ణయం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె భౌతికంగా లేనప్పటికీ, తన దాతృత్వం ద్వారా అందరికీ మార్గదర్శిగా మిగిలిపోతారన్నారు. అనంతరం రాజ్యలక్ష్మి రాసిన వీలునామా ప్రకారం అమ్మ ఛారిటబుల్ ట్రస్టుకు రూ.15 లక్షలు, శిర్డీ సాయి సేవా ట్రస్టుకు రూ.10 లక్షలు, శిష్ట్లా రాజ్యలక్ష్మి పేరుతో ఏర్పాటైన మెమోరియల్ ట్రస్టుకు రూ.36 లక్షలు (చెక్కుల రూపంలో) రాజ్యలక్ష్మి తల్లి సావిత్రమ్మ సమక్షంలో ఆయా సంస్థల ప్రతినిధులు అయ్యప్పరాజు, దేవరశెట్టి సురేష్, చిట్టే వెంకట్‌లకు అందజేశారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి సోదరుడు రామకృష్ణ, ఐఆర్ఎస్ అధికారులు బి.లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వరరావు, మనోజ్‌కుమార్, కమల్ సీనా, రవికుమార్, నాగరాజు, జీఎస్టీ అధికారులు సీహెచ్. వెంకటేశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, సీహెచ్.ఈశ్వర్, యుగంధర్, మూర్తి, పింఛనర్ల సంఘం తరఫున వివేకానంద, పీవీ సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.



అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అయ్యప్పరాజుకు రూ.15 లక్షల చెక్కు అందిస్తున్న జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి, సావిత్రమ్మ తదితరులు

త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీని రీయింబర్స్‌మెంట్ చేయనున్నట్లు వెల్లడించారు. ట్రెండ్‌కు తగ్గట్టుగా నేత కార్మికులకు శిక్షణ ఇచ్చి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. మంగళగిరిలోని చేనేత కార్యాలయంలో బుధవారం వివిధ జిల్లాల డీడీలు, ఏడీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. 'చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించేందుకు కసరత్తు ప్రారంభించాం. చీరాలలో నూతనంగా టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తాం' అని పేర్కొన్నారు.

రేపటి నుంచి మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

జార్జియాలో ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం

ఈనాడు డిజిటల్, అమరావతి: విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నుంచి వచ్చే నెల 1 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. ఆయా తేదీల్లో పలు సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలపై చర్చిస్తారు. ఇందులో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒరాకిల్ సంస్థ ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో 25న సమావేశమవుతారు. పత్ర సినర్జీస్, బోసన్, స్పాన్‌ఐఓ, క్లారిటీ, ఎడోబ్, స్కేలర్, జనరల్ అటమిక్స్ సంస్థల ప్రతినిధులు, భారత కాన్సుల్ జనరల్‌తో 26న భేటీ అవుతారు. ఆస్టిన్‌లోని పలు కంపెనీల ప్రతినిధులతో 27న, రెడ్‌మండ్‌లో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో 28న భేటీ కానున్నారు. 29న అమెజాన్ సహా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం కావడంతోపాటు ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ నెల 30న కూడా వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 31న జార్జియాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. న్యూయార్క్‌లో పెట్టుబడిదారులతో నవంబరు 1న సమావేశమవుతారు.

పొట్ల కాదు వంకాయే!



శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం సవరడ్డపనస గ్రామానికి చెందిన చీడి విశ్వప్రసాద్ ఇంటి ఆవరణలోని ఓ వంగ మొక్క అడుగున్నర పొడవైన కాయ కాసింది. కర్ణాటకకు చెందిన ఓ రైతు దేశీయ కూరగాయలు సాగు చేస్తున్నట్లు విశ్వప్రసాద్ యూట్యూబ్‌లో చూసి తెలుసుకున్నారు. ఆయన్నుంచి 'ఇల్లీకుంబన్ ఎగ్ ప్లాంట్' రకం విత్తనాలు కొని, పోస్టులో తెప్పించుకున్నారు. వాటిని సేంద్రియ విధానంలో పెంచగా పొడవైన కాయ కాసింది. కేరళకు చెందిన ఈ రకం వంగ సాధారణంగానే పొడవైన కాయలు ఇస్తుందని ఉద్యాన అధికారిణి మంగమ్మ తెలిపారు. – న్యూస్‌టుడే, సారవకోట

వైకాపా హయాంలో.. రౌడీలను పెంచి పోషించారు

మాజీ మంత్రి పీతల సుజాత

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా హయాంలో గంజాయి సాగును నియంత్రించకపోగా, రౌడీమూకలను పెంచి పోషించారని మాజీ మంత్రి పీతల సుజాత విమర్శించారు. అందుకే రాష్ట్రంలో ప్రస్తుతం హత్యాచారాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక మత్తు పదార్థాల అమ్మకం, వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉక్కుపాదం మోపుతున్నారని స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు.

విశాఖ ఉక్కులో వీఆర్ఎస్ ప్రతిపాదన విరమించుకోవాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారంలో స్వచ్ఛంద పదవీ విరమణ ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. "విశాఖ ఉక్కు కర్మాగారంలో సర్వే పేరుతో ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి సాగనంపడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఉద్యోగులందరూ వీఆర్ఎస్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించాలి. కార్మికుల పోరాట ఫలితంగా రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ తెరుస్తున్న సమయంలో ఈ చర్య ఉత్పత్తిని దెబ్బకొడుతుంది. సెయిల్‌లో విలీనం చేయకుండా వీఆర్ఎస్‌ను ప్రవేశపెట్టడాన్ని కార్మికులు ప్రతిఘటించాలి" అని సూచించారు.